

ఏపీఈఏపీసెట్‌కు 95.77 శాతం మంది హాజరు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీసెట్-2025కు గురువారం జిల్లాలో 95.77 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పరీక్షను ఉదయం, మధ్యాహ్నం నిర్వహించారు. రెండు పూటలా కలిపి 6,550 మంది హాజరుకావాల్సి ఉండగా 6,273 మంది (95.77 శాతం) హాజరయ్యారు.

వైసీపీ నేత భూ మాయ

జెర్రిపోతులపాలెంలో చెరువు కబ్జా

- అతుకుబడి పట్టాగా రికార్డుల్లో మార్పు
- ఎన్‌హెచ్ విస్తరణలో పరిహారం కొట్టేసిన వైనం
- ఎఫ్ఎంబీలో చెరువుగానే పేర్కొన్న అధికారులు
- గతంలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు
- పెందుర్తి రెవెన్యూ అధికారుల లీల
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జనసేన నేత
- పట్టించుకోని ఉన్నతాధికారులు



చెరువు భూమిలో సరుగుడు మొక్కలు సాగు చేస్తున్న దృశ్యం

పెందుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి):
వైసీపీ పాలనలో కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్టుగా జిల్లాలో దోపిడీ సాగిపోయింది. ప్రభుత్వ భూములు, కొండలు, సాగునీటి కాలువలను సైతం ఆక్రమించుకుని, బలవంతంగా పట్టాలు చేయించుకున్న బాగోతాలు బయటపడుతూనే ఉన్నాయి. ఇదే కోవలో పెందుర్తి రెవెన్యూ అధికారుల లీలతో ఏకంగా చెరువునే డీ పట్టా భూమిగా మార్చేసి, చదును చేయడమే కాకుండా, జాతీయ రహదారి విస్తరణలో భూమి పోతోందంటూ రూ.50 లక్షల పరిహారాన్ని కూడా ఓ వైసీపీ నేత తీసుకున్నారు.

పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం సరిహద్దు పెదగాడి రెవెన్యూ సర్వే నంబరు 420లో 4.75 ఎకరాల చెరువు ఉంది. రెవెన్యూ ఫీల్డ్ మెజర్‌మెంట్ రికార్డులు, ఎఫ్ఎంబీ స్కెచ్‌లో ఇప్పటికీ దీనిని చెరువుగానే చూపిస్తున్నారు. ఇది చెరువు భూమి అని 2017లో రెవెన్యూ అధికారులు నిర్ధారించడంతో అక్కడ 1.92 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాల కోసం గనుల శాఖ అనుమతినిచ్చింది.

అతుకుబడి భూమిగా మార్చి..

కాలక్రమంలో చెరువు స్వరూపం మారడంతో జెర్రిపోతులపాలేనికి చెందిన వైసీపీ నేత కన్ను దానిపై పడింది. ఆ భూమి తనదేనంటూ కొన్నిపత్రాలు చూపి రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డుల్లో మార్పించుకున్నారని టీడీపీ, జనసేన నేతలు ఆరోపిస్తున్నారు. సర్వే నంబరు 420లో చెరువు ఉంటే 420/1 సబ్ డివిజన్‌గా చూపించినట్టు ఆరోపణలున్నాయి. వెబ్‌ల్యాండ్‌లో అతుకుబడి భూమిగా నమోదు కావడంతో విచారణ లేకుండనే అధికారులు డీ పట్టా ఇచ్చేశారు. దీంతో చెరువు స్థలాన్ని చదును చేసి మొత్తం పూడ్చివేశారు. వ్యవసాయ భూమి అని నమ్మించేందుకు సరుగుడు మొక్కలు పెంచారు.

రహదారి విస్తరణ పరిహారం

షీలానగరం-సబ్బవరం ఆరు వరుసల రహదారి విస్తరణకు జరిపిన భూ సేకరణలో వైసీపీ నేత ఆధీనంలో ఉన్న చెరువు స్థలంలో అర ఎకరా పోయింది. ఇది చెరువు భూమి అని ఎఫ్ఎంబీ స్కెచ్‌లో ఉండడంతో మొదట పరిహారం దక్కలేదు. దీంతో జాతీయ రహదారి సంస్థ అధికారులపై రాజకీయ ఒత్తిడి తీసుకువచ్చి, ఉన్నతస్థాయి అధికారితో రహస్య ఒప్పందం చేసుకుని, రూ.50 లక్షలు పరిహారం తీసుకున్నారు. ఇందులో అప్పటి ఎన్‌హెచ్ అధికారి ప్రమేయం ఉందన్న ఆరోపణలున్నాయి.

అధికారుల లీల

ఎఫ్ఎంబీలో పక్కాగా చెరువుగా నమోదై ఉండగా దానిని అతుకుబడి పట్టా భూమిగా మార్చడం వెనుక రెవెన్యూ అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్వే నంబరు 420లో చెరువుండగా, దానిని సబ్ డివిజన్ ఎలా చేశారో అంతుబట్టడం లేదంటున్నారు. ఏదైనా భూమి స్వరూపం మార్చేందుకు ల్యాండ్ క్లాసిఫికేషన్ జరగాలి. చెరువులో నాలుగు ఎకరాలకు డి.పట్టా మంజూరుచేసిన అధికారులు, మిగిలిన భూమిలో 25 సెంట్లను మాత్రమే చెరువుగా చూపించారు. అంతేకాదు ఇందులో మరో 50 సెంట్ల స్థలానికి మరొకరికి డీ పట్టా మంజూరుచేశారని సమాచారం. ఈ చెరువు కబ్జా వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని జనసేన నేత గల్లా రమణ తెలిపారు. అయినప్పటికీ చర్యలు లేవన్నారు. ఉన్నత స్థాయి అధికారులు విచారణ చేపడితే మొత్తం వ్యవహారం ... మిగతా 6వ పేజీలో



కరోనా కలకలం

- నగరంలో 28 ఏళ్ల మహిళకు కొవిడ్ పాజిటివ్
- ఆరోగ్య శాఖ అప్రమత్తం

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
నగరంలో కరోనా వైరస్ మరోసారి కలకలం సృష్టించింది. రెండు, మూడేళ్ల తరువాత మళ్లీ పాజిటివ్ కేసు నమోదైంది. పిఠాపురం కాలనీలో నివాసం ఉంటున్న 28 ఏళ్ల మహిళ కొద్దిరోజుల నుంచి చలి, జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మూడు రోజుల క్రితం ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. వైద్య సేవలు అందించే క్రమంలో ఆమెకు కరోనా ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. వెంటనే విషయాన్ని సదరు ఆస్పత్రి అధికారులు ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేశారు. ఆరోగ్య శాఖ అధికారుల సూచనల మేరకు గురువారం ఆర్‌టీపీసీఆర్ పరీక్ష నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగుపడడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కొవిడ్ కేసు నమోదుకావడంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. నాలుగు టీమ్‌లను ఏర్పాటుచేసి మహిళ నివాసం ఉంటున్న పిఠాపురం కాలనీలో ఇంటింటి సర్వేను నిర్వహించారు. 70 ఇళ్ల పరిధిలోని 200 మందికి సంబంధించిన ఆరోగ్య వివరాలను సేకరించారు. అలాగే, మహిళ భర్తతోపాటు సోదరి నుంచి నమూనాలు సేకరించి కేజీహెచ్ ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లోకి వెళ్లినప్పుడు మాస్క్ ధరించాలన్నారు.

రైల్వే జోన్ పనులకు శ్రీకారం

- ముడసర్లోవలో కేటాయించిన భూమి చదును పనులు ప్రారంభం



రైల్వే జోన్‌కు కేటాయించిన భూమిలో చదును పనులు

- రూ.172 కోట్లతో కార్యాలయ నిర్మాణం
- 28 నెలల్లో పూర్తి చేయడానికి యత్నం
- చీఫ్ పరిపాలన అధికారి పర్యవేక్షణ

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయం పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ముడసర్లోవలో జీవీఎంసీ ఇచ్చిన స్థలంలో కొద్దిరోజులుగా భూమి చదును పనులు జరుగుతున్నాయి. సుమారు రూ.172 కోట్ల అంచనా వ్యయంతో భవన సముదాయం నిర్మించాలని నిర్ణయించారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి 36 నెలల్లో పూర్తిచేయాలనేది లక్ష్యం కాగా 28 నెలల్లోనే సిద్ధం చేస్తామంటున్నారు. రెండు కాంట్రాక్ట్ సంస్థలకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. పనిచేసే సిబ్బంది కోసం క్యాంపు షెల్టర్ల నిర్మాణం పూర్తిచేసి అక్కడ వంటకు ఏర్పాట్లు చేశారు. జోన్ కార్యాలయం నిర్మాణ పనులను ప్రస్తుతం చీఫ్ పరిపాలన అధికారి పర్యవేక్షిస్తున్నారు.

వేగంగా సాగాలంటే జీఎం ఉండాల్సిందే

జోన్ కార్యాలయం నిర్మాణానికి ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరి 8న శంకుస్థాపన చేశారు. నాలుగు నెలలు గడిస్తే గాని అక్కడ భూమి చదును పనులు ప్రారంభం కాలేదు. సాధారణంగా కొత్త రైల్వే జోన్ ప్రకటిస్తే... దాని పనితీరు, పరిధి, ఇతరత్రా వివరాలతో మొదట గెజిట్‌ను ప్రకటిస్తారు. దక్షిణ కోస్తా జోన్ విషయంలో ఆ సంప్రదాయం పాటించలేదు. గెజిట్ ... మిగతా 6వ పేజీలో

నేడు టీడీపీ మినీ మహానాడు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా స్థాయి మినీ మహానాడు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నగరంలోని పార్టీ కార్యాలయంలో జరగనున్నదని పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జీ తెలిపారు. మహానాడుకు పార్లమెంటు పరిధిలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వరుణ్‌కు వరాలు

- 'తాజ్ వరుణ్ బీచ్' పేరిట చేపట్టనున్న మెగా ప్రాజెక్టుకు రాయితీలు



ప్రాజెక్టు స్థలం

- 15 ఏళ్లు రాష్ట్ర జీఎస్‌టీ 100 శాతం రీయింబర్స్‌మెంట్
- స్టాంపు డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 100 శాతం రీయింబర్స్‌మెంట్
- పెట్టుబడి ప్రోత్సాహకం రూ.40 కోట్లు
- పరిశ్రమల విభాగం కింద విద్యుత్ చార్జీలు
- పెట్టుబడి రూ.722 కోట్లు, 1,300 మందికి ఉపాధి

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
'వరుణ్ గ్రూపు సంస్థల అధినేత ప్రభుకిశోర్ నగరంలోని ఆర్కే బీచ్ రోడ్డులో తాజ్ గేట్‌వే హోటల్ స్థానంలో 'వరుణ్ హాస్పటాలిటీ' సంస్థ పేరిట నిర్మిస్తున్న మెగా ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీల రూపంలో వరాల జల్లు కురిపించింది. ఆ స్థలంలో 260 గదులతో ఫైవ్ స్టార్ హోటల్, 90 సర్వీస్ అపార్ట్‌మెంట్లు, 12,750 చ.అ. విస్తీర్ణంలో కన్వెన్షన్ సెంటర్, టెక్నాలజీ స్పేస్ (2,500 సీటింగ్ కెపాసిటీ)తో నిర్మించే భవన సముదాయానికి 'తాజ్ వరుణ్ బీచ్'గా నామకరణం చేశారు. దీనికి పెట్టుబడి రూ.722 కోట్లు అవుతుందని అంచనా. సంస్థ సమర్పించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం నిర్మాణం పూర్తయ్యేసరికి వ్యయం రూ.899.5 కోట్లు అవుతుందని, 318 గదులతో హోటల్ వస్తుందని, అందులో 1,300 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొంది. ఈ ప్రతిపాదనలు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ముందుంచగా 2024-29 ఏపీ టూరిజం పాలసీ ప్రకారం అల్ట్రా మెగా ప్రాజెక్టుగా ... మిగతా 6వ పేజీలో

ప్రకటించిన రాయితీలు

- రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించే జీఎస్‌టీ 15 ఏళ్ల రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. అంటే జీరో ఎస్‌జీసీటీ.
- ప్రాజెక్టు ఆస్తుల రిజిస్ట్రేషన్‌పై 100 శాతం స్టాంపు డ్యూటీ, 100 శాతం ట్రాన్స్‌ఫరీ డ్యూటీ రీఎంబర్స్‌మెంట్.
- భూ వినియోగ మార్పిడి ఫీజులు 100 శాతం రీఎంబర్స్‌మెంట్.
- భూమి, భవనాలు, షెడ్లు వంటి లీజు ఒప్పందాలపై 100 శాతం స్టాంపు డ్యూటీ రీఎంబర్స్‌మెంట్.
- పెట్టుబడి ప్రోత్సాహంగా అల్ట్రా మెగా టూరిజం విభాగం లోమ రూ.40 కోట్లు ప్రోత్సాహకం. దీనిని ఏడాదికి ఎనిమిది కోట్లు చెప్పిన ప్రభుత్వం ఇస్తుంది.
- హోటళ్లకు సాధారణంగా వాణిజ్య విభాగంలో విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తారు. అంటే యూనిట్‌కు పది రూపాయలపైనే పడుతుంది. ఇపుడు ఈ సంస్థకు పరిశ్రమల రేటుకు అంటే యూనిట్ ఆరు రూపాయలకే ఇవ్వనున్నారు.
- విద్యుత్ సుంకం యూనిట్‌పై రూపాయి వసూలు చేస్తారు. దీనిని ఐదేళ్ల వరకు రీఎంబర్స్‌మెంట్ చేసుకోవచ్చు. ఇది ఏడాదికి రూ.82.8 లక్షలు వరకు ఉంటుంది.
- - ఆస్తిపన్ను, నీటి సరఫరా ఛార్జీలు, మురుగునీటి ఛార్జీలు, అన్నీ పరిశ్రమల విభాగం కింద నిర్ణయిస్తారు. అంటే తక్కువ ఛార్జీలే వర్తిస్తాయి.
- ఉపాధి కల్పించిన వారి సంఖ్యను బట్టి ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్ కూడా ఇస్తారు.

ఏయూ దూర విద్య ప్రాక్టికల్స్‌కు కలెక్షన్

రాష్ట్ర వ్యాప్తంగా 58 ప్రైవేటు కాలేజీల్లో తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహణ

- అనేక కాలేజీల్లో తరగతులు, ప్రాక్టికల్స్‌కు హాజరుకాని విద్యార్థులు
- ఒక్కొక్కరి నుంచి రూ.6 వేలు వసూలుచేసి మేనేజ్ చేస్తున్న యాజమాన్యాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- గతంలో మాదిరిగా ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహిస్తే అక్రమాలకు అడ్డుకట్ట



విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
ఏయూ దూరవిద్య పరీక్షా కేంద్రాల్లో వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట పడడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. బ్యాక్‌లాగ్స్ ఉన్న 2019-22 బ్యాచ్ బీఎస్సీ అభ్యర్థులకు ఈ నెల 12 నుంచి వచ్చే నెల పదో తేదీ వరకు తరగతులు, ప్రాక్టికల్స్ నిర్వహించేలా దూరవిద్య అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఇందుకోసం ఇటు శ్రీకాకుళం నుంచి అటు అనంతపురం జిల్లా వరకు 58 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే, వాటిలో దాదాపు 10 నుంచి 20 కాలేజీలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. విద్యార్థి ప్రాక్టికల్స్‌కు ముందు ఆయా కాలేజీల్లో నిర్వహించే తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది. అయితే, దూరవిద్య కోర్సుల్లో చేరిన అభ్యర్థుల్లో దాదాపు 99 శాతం మంది ఉద్యోగాలు, వ్యాపకాల్లో ఉన్నవారే ఉంటారు. వారిలో చాలామంది తరగతులకు, ప్రాక్టికల్స్‌కు హాజరుకారు. అటువంటి వారిపై ఈ కేంద్రాల నిర్వాహకులు దృష్టిసారించారు. తరగతులకు హాజరు కాకుంటే ... మిగతా 6వ పేజీలో




ఆరిలోవ సచివాలయంలో పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు

సచివాలయాల్లో కంప్యూటర్లు మొరాయింపు

- ప్రింటర్లకు టోనర్లు, స్టేషనరీ కొరత
- సేవలకు ఆటంకం
- కొత్తవాటి కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో మూడింట ఒక వంతు గ్రామ/వార్డు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు మూలకు చేరాయి. వార్డు/గ్రామ సచివాలయాలను ప్రారంభించినప్పుడు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫర్నీచర్, స్టేషనరీ అందజేశారు. అయితే వాటి నిర్వహణపై తగినంత దృష్టిసారించకపోవడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. జిల్లాలో మొత్తం 607 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా...వాటిలో 220 చోట్ల కంప్యూటర్లు, 200 చోట్ల ప్రింటర్లు పనిచేయడం లేదు. మిగిలినచోట్ల కంప్యూటర్లు ఎప్పటికప్పుడు మొరాయిస్తున్నాయి. ప్రింటర్లకు టోనర్లు, పేపరు సరఫరా నిలిపివేశారు. కాగా కంప్యూటర్లు పనిచేయనిచోట సిబ్బంది సొంతంగా ల్యాప్‌టాప్‌లు తెచ్చుకుంటున్నారు. కంప్యూటర్లు/ల్యాప్‌టాప్‌లతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, సేవలకు సంబంధించి ప్రింట్ ఇవ్వకపోవడంతో సిబ్బందితో ప్రజలు వాగ్వాదానికి దిగుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి దృష్టికి అధికారులు తీసుకువెళ్లారు. ఆయన సూచన మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. కొత్తగా కంప్యూటర్లు, ప్రింటర్లు, స్టేషనరీ సరఫరా చేయాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి



సింహగిరి మెట్లమార్గంలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని పూలమాలలు, తమలపాకులతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లి అంజనీపుత్రుడుని దర్శించుకుని పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద ప్రసాదాల పంపిణీ, మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల తొలగింపు?

- ఐదుగురి బయోమెట్రిక్ నిలిపివేతకు ఉక్కు యాజమాన్యం నిర్ణయం?

ఉక్కుటౌన్‌షిప్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు ఐదుగురిని ఉద్యోగం నుంచి స్టీల్‌ప్లాంటు యాజమాన్యం తొలగించినట్టు తెలిసింది. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు దిగిన నేపథ్యంలో పోరాటానికి నాయకత్వం వహిస్తున్న ఐదుగురి బయోమెట్రిక్‌ను యాజమాన్యం నిలిపివేసింది. కాంట్రాక్టు కార్మికుల అంశంపై ప్రస్తుతం ఆర్ఎల్‌సీ (రీజనల్ లేబర్ కమిషనర్) సమక్షంలో చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల 26న మరోసారి చర్చలు జరగనున్నాయి. ఇదిలావుండగా ప్రస్తుతం ప్లాంటులో ఉన్న పరిస్థితుల దృష్ట్యా శుక్రవారం అధికారులు సమావేశం కానున్నట్టు తెలిసింది.

కాంట్రాక్టర్లతో సమావేశం...

కార్మికుల నిరవధిక సమ్మె నేపథ్యంలో కాంట్రాక్టర్లతో గురువారం సాయంత్రం అధికారులు సమావేశమయ్యారు. అప్పగించిన పనులు చేయాలని, కార్మికులను పిలిపించుకోవాలని సూచించారు. అయితే తాము కాంట్రాక్టు కార్మికులపై చర్యలు తీసుకోలేమని, విధులకు రమ్మని మాత్రం చెబుతామని కాంట్రాక్టర్లు స్పష్టంచేశారు.


పూజ చేస్తున్న అర్చకుడు

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణ జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ పుష్పంతో అర్చనలు చేశారు. తరువాత ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

స్పీడు బ్రేకర్లు లేక ప్రమాదాలు

సాగర్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులోని సాగర్‌నగర్ వద్ద పలుచోట్ల స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బీచ్ రోడ్డు నుంచి సాగర్‌నగర్‌లోకి వచ్చే కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ కూడలి వద్ద వాహనాలు అత్యంత వేగంతో దూసుకుపోతుంటాయి. సాగర్‌నగర్ లోపల నుంచి బీచ్ రోడ్డు దాటడానికి పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వినాయకుడి గుడి వద్ద ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్ ఏమాత్రం వాహనాల నిరోధానికి ఉపయోగపడడం లేదు. ఈ ఆలయానికి సమీపంలోనే కాస్తా దూరంలో మరో స్పీడు బ్రేకర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.ఇదే కూడలిలో రుషికొండ వైపు నుంచి వచ్చే మార్గంలోనూ అదనంగా స్పీడు బ్రేకర్ ఏర్పాటు చేయాల్సి వుంది.

రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణకు సర్వర్ సమస్య

పద్మనాభం రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణకు సర్వర్ సమస్య వేధిస్తోంది. ఈనెల 6వ తేదీ నుంచి సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్డుల్లో పేర్లు, చిరునామా మార్పు, చేర్పులకు కూడా అవకాశం కల్పించారు. దీంతో అధిక సంఖ్యలో దరఖాస్తులు చేస్తుండడంతో సర్వర్ సమస్య నెలకొంటోందని డిజిటల్ అసిస్టెంట్లు చెబుతున్నారు. మండలంలోని 16 సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కసారి కూడా కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఒకేసారి అధిక దరఖాస్తులు వస్తున్నాయని, దీనివల్ల సర్వర్ సమస్య తలెత్తుతుందని అధికారులు చెబుతున్నారు, ఈ విషయమై సీఎస్‌డీటీ రమణ మాట్లాడుతూ ఒకేసారి ఎక్కువ దరఖాస్తులు రావడంతో సర్వర్ సమస్య వస్తుందన్నారు. కాగా కొత్త రేషన్ కోసం దరఖాస్తు చేసేవారు మ్యారేజ్ సర్టిఫికెట్ జత చేయాల్సిన అవసరం లేదని తహసీల్దార్ కాకర ఆనందరావు తెలిపారు. మారేజ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ వెసులుబాటు కల్పించారన్నారు.

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశ పరీక్ష

సాగర్‌నగర్/ఎండాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్న యూజీ, పిజి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు తెలిపారు. గురువారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యూజీ స్థాయిలో బీకామ్, బిజినెస్ ఎనలిటిక్స్, ఫైనాన్సియల్ మార్కెట్స్, జనరల్ బీబీఏ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో ఎంబీఏ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా మెడ్‌టెక్ జోన్, అకాడమీ ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబీఏ హాస్పటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 24వ తేదీలోగా గీతం వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అడ్మిషన్ల డైరెక్టర్ ఎం. జగదీశ్, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లుబ్నా నిహర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎ. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి బంగారు హారం బహూకరణ

మహారాణిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారికి ఓ భక్తుడు మూడున్నర లక్షల రూపాయలు విలువ చేసే 41.830 గ్రాముల బంగారు హారం బహూకరించారు. మధురవాడ ప్రాంతానికి చెందిన కె. శ్రీనివాసరావు తన తల్లి వనజాక్షి పేరు మీద ఈ హారాన్ని ఆలయ ఈఓకి గురువారం అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, వారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రం, ఆశీర్వాదం, ప్రసాదాన్ని అందించారు.

జై హనుమాన్

- నియోజకవర్గంలో ఘనంగా హనుమాన్ జయంత్యుత్సవం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భీమునిపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ హనుమత్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు.భీమునిపట్నంలో సీతారామలక్ష్మణ సహిత శ్రీదాస ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామున అయిదు గంటలకు అష్టోత్తర శత నారికేళములతో స్వామికి అభిషేకాలు జరిపారు. అర్చకులు ఆసూరిమరిగంటి వంశీమోహన చెన్నకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు శ్రీరామ సంకీర్తనం, హనుమాన్ చాలీసా ఆలపించారు. అనంతరం రామతీర్థం దేవస్థానం స్థానాచార్యులు గొడవర్తి నర్సిమహాచార్యులు హనుమత్ వైభవం పురాణ ప్రవచనం చేశారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మానం ఆంజనేయనగర్‌లో...

మధురవాడ : జీవీఎంసీ ఏడో వార్డు మానం ఆంజనేయనగర్‌లో లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

చిట్టివలస రామాలయంలో...

తగరపువలస :చిట్టివలస జూట్‌మిల్లు రామాలయంలో హనుమత్ జయంతి ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రామ్‌కుమార్, రాజు, వైసీపీ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కాగా హనుమత్ జయంతి సందర్భంగా చిట్టివలస బాలికల ఉన్నత పాఠశాల వద్ద అభయ ఆంజనేయస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి రమేశ్ ప్రారంభించిన ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు జి. సదానందరావు, వై. వెంకటరావు, డి. వెంకటేశ్, పి. నానిబాబు, టి. అప్పలరాజు, ఎన్. రామారావు పాల్గొన్నారు.

చంద్రంపాలెంలో...

కొమ్మాది : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి పంచామృత,సుగంధ జలాభిషేకాలు జరిపి, 500 మూరల తులసి మాలలు వేసి, వివిధ రకాల ఫలాలతో అలంకరించారు. అనంతరం సింధూరార్చన,తమలార్చన, పుష్ప అర్చన చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

సింహాచలం : సింహగిరి మెట్ల మార్గంలో కొలువుదీరిన సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో మూడు రోజులుగా జరుగుతున్న హనుమాన్ జయంత్యుత్సవాలు గురువారం జరిగిన పూర్ణాహుతితో ముగిసాయి. మూడు రోజుల పాటు శ్రీమద్రామాయణంలోని సుందరకాండను రుత్విక్‌లు పారాయణం చేయడంతో పాటు ప్రత్యేక హవనం జరిపారు. ఆఖరి రోజు సూర్యోదయం వేళ స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకం జరిపారు.తరువాత ఆంజనేయునికి ప్రీతికరమైన తమల పత్రాలతో సహస్ర నామార్చన, సింధూరార్చన చేశారు. అనంతరం ఉదయం 9.40 గంటలకు రామాయణంలోని శ్రీరామ పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. మూడు రోజుల పాటు జరిపిన హవనంలో మహా పూర్ణాహుతి చేశారు.

ఆనందపురంలో...

ఆనందపురం:మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఘనంగా జరిపారు. తెల్లవారుజాము నుండే ఆంజనేయస్వామి విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్లువాడలో ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకటరావు ఆధ్వర్యంలో పూజలు జరిపి, సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు జరిపారు. సాయంత్రం హనుమాన్ చాలీసా చేపట్టారు. వెల్లంకి, పెద్దిపాలెం,ఆనందపురం, వేములవలస, చందక, కుసులువాడ, రామవరం, గండిగుండం గ్రామాల్లోనూ వేడుకలను నిర్వహించారు.


భీమిలిలో తమలపాకులతో అర్చన

జీరుపేటలో బైటో భజన

భీమునిపట్నం (రూరల్) : జీరుపేట రామాలయంలో హనుమత్ జయంతి సందర్భంగా బైటో భజన నిర్వహించారు. చిల్లపేట బైటో భజన బృందం ఆధ్వర్యంలో మూడు గంటల పాటు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.

పద్మనాభంలో..

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. పద్మనాభం, ఇసకలపాలెం, రేవిడి, తునివలస, రెడ్డిపల్లి, మద్ది గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకాలు, సింధూరార్చన, తమలపాకుల అర్చన నిర్వహించారు. ఇసకలపాలెం, రెడ్డిపల్లిలో భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డిపల్లి హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మోటారు సైకిళ్లపై హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.


పద్మనాభంలో హనుమాన్ శోభాయాత్ర


కొమ్మాది : పూల అలంకరణలో స్వామివారు



ముంపు సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే గంటా ఆదేశాలతో పని పూర్తి చేసిన ఇరిగేషన్ అధికారులు

తగరపువలస, మే 22 (ఆంధ్రజ్యోతి) : వర్షం పడిన ప్రతిసారి తగరపువలస దరి సంగివలస వద్ద అండర్ పాత్ వేలో నీరు నిలిచిపోతున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో ఈ సమస్య పరిష్కారమైంది. సబ్బివానిపేట, సంగివలస ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో వర్షం పడితే ఆ నీరంతా సంగివలస సర్వీసు రోడ్డులో చేరి వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఈ సమస్య పరిష్కారానికి నిల్వ నీటిని సమీపంలో ఉన్న గుండం చెరువులోకి పంపించాలని, అందుకు వీలుగా చెరువు మదుములు ఎత్తు తగ్గించాలని ఇంజనీరింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈమేరకు చెరువులోకి వెళ్లిన నీరు బయటకు వెళ్లడానికి ఔట్‌లెట్లు నిర్మించారు.దీనివల్ల ఇకపై నీరు నిల్వ ఉండదు. గురువారం ఉదయం పడిన వర్షానికి చుక్క నీరు కూడా ఇక్కడ నిల్వలేదు. వర్షాలు వచ్చినా ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎమ్మెల్యే చెప్పారు.


సంగివలస వద్ద ఉన్న అండర్ పాత్ వే

కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక

- ప్రధాని, సీఎం, గవర్నర్ రాక
- 15 వేల మందికి ఏర్పాట్లు
- పార్క్ హోటల్ వరకు 50 వేల మందితో ఆసనాలు
- జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో వచ్చే నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక ఏర్పాటు చేసే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. యోగా డే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆయన గురువరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితర ప్రముఖులతో పాటు 15 వేల మంది హాజరవుతారన్నారు. అక్కడి నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు బీచ్ రోడ్డులో సుమారుగా 50 వేల మంది యోగాసనాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి భీమిలి వరకు ఎక్కడికక్కడ యోగాసనాల శిబిరాలు ఉంటాయని తెలిపారు. పార్క్ హోటల్ నుంచి తెన్నేటి పార్క్ వరకు, అక్కడి నుంచి కైలాసగిరి వరకు, అక్కడి నుంచి రుషికొండ వరకు, అక్కడి నుంచి తిమ్మాపురం, అక్కడి నుంచి భీమిలి వరకు మరో బృందం బాధ్యత వహిస్తుందన్నారు. ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తామని, పార్కింగ్ స్థలాలు కూడా కేటాయిస్తామని, అక్కడి నుంచి కంపార్ట్‌మెంట్లకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఉంటుందన్నారు.ప్రతి బృందంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జోనల్ కమిషనర్, తహసీల్దార్, 20 మంది వలంటీర్లు ఉంటారన్నారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు అతిథులు వస్తారని, ఎవరు.. ఎక్కడికి ఎలా వెళ్లాలో సూచించే విధంగా బోర్డులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవంలో 2.5 లక్షల మందిని భాగస్వాములుగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, భీమిలి ఆర్‌డీఓ సంగీత్ మాథుర్, స్పెషల్ సబ్ కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదనరావు , తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు వయసుతో సంబంధం లేదు : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం (రూరల్), మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించడానికి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లడానికి వయసుతో సంబంధం లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన భీమిలిలోని తన క్యాంపు కార్యాలయంలో లక్ష్మీపురం మాజీ సర్పంచ్ కరుభక్త జోగినాయుడును శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతకాలంగా జోగినాయుడు తన పరిధిలో ఉన్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారని చెప్పారు. 75 ఏళ్ల వయసులోనూ ఆయన ప్రజా సేవ చేయడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గాడు తాతినాయుడు, మజ్జివలస ఎంపీటీసీ మాజీ సభ్యుడు మొకర పైడినాయుడు, కనకల వెంకట్రావు, లక్ష్మీపురం ఉప సర్పంచ్ బి. బంగారునాయుడు పాల్గొన్నారు.


జోగినాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


మధురవాడలో సీఐటీయూ నిరసన ర్యాలీ



మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మికులను విధుల నుంచి అక్రమంగా తొలగించడం అన్యాయమని మధురవాడ జోన్ సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. గురువారం వారు మధురవాడ మార్కెట్ నుంచి నగరంపాలెం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీటూ నాయకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్లాంట్ పరిరక్షణ కోసం సమ్మె చేసిన కాం ట్రాక్టు కార్మికులను అన్యాయంగా విధుల నుంచి తొలగిస్తున్నారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు అప్పలరాజు, కొండమ్మ, కిరణ్, సంధ్య, రాము, రవి పాల్గొన్నారు.

'దళితులపై దాడులు సరికాదు'


సర్వీసు రోడ్డులో రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు

భీమునిపట్నం (రూరల్), మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా తాళ్లవలస జాతీయ రహదారిపై అంబేడ్కర్ యువజన సంఘం కార్యకర్తలు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు బి. సన్నిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఉత్తరాంధ్ర మాలమహానాడు వ్యవస్థాపక కార్యదర్శి బాగం గోపాలరావు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో దళిత విద్యార్థిని అగ్రవర్ణాలకు చెందిన వారు కులంపేరుతో దూషించి కిడ్నాప్‌కు పాల్పడ్డారన్నారు దళితులపై దాడులు చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, ముత్యాలరావు, శివ, కె. అప్పన్న, ఎస్. రాంబాబు బి. నరసిహారావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు పంపిణీ

కొమ్మాది, మే 22 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన వార్డు పరిధిలోని పారిశుధ్య సిబ్బందికి సబ్బులు, కొబ్బరినూనె అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, రెడ్డి సత్యనారాయణ, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

సింహాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరి చేరవని రిటైర్డ్ హెచ్‌ఎం కెఎస్‌ఆర్ మూర్తి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం సారధ్యంలో గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఆయన మాట్లాడారు. పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. అలాగే స్టోరీ టెల్లింగ్, బుక్ రీడింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణరావు మాస్టారు మృతి పట్ల నివాళి

పద్మనాభం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నారాయణరావు మాస్టారు మృతి పట్ల తమిళనాడులోని చెన్నై హౌసింగ్ ఎండీగా పని చేస్తున్న ఐఏఎస్ అధికారి మంత్రి గోవిందరావు నివాళి అర్పించారు. గురువారం ఆయన రెడ్డిపల్లి వచ్చి తనకు చదువు నేర్పిన గురువుకి కడసారి వీడ్కోలు పలికారు. కాగా విజయనగరం జిల్లా బొండపల్లి మండలం జె.గుమడాం గ్రామా నికి చెందిన గోవిందరావు 1994-95లో శాంతినికేతన్ పాఠశాలలో చదివారు. అనంతరం 2011లో ఐఏఎస్‌గా ఎంపికై తమిళనాడులోని తంజావూరు, కుంభకోణం తదితర జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు.


మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఐఏఎస్ గోవిందరావు

సీపీఐ నేత కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

మధురవాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పాత మధురవాడ మెట్టకు చెందిన సీపీఐ నాయకుడు కుడిపూడి అరుణ్‌కుమార్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఆయన మృతదేహానికి పాతమధురాడ శ్మశానవాటికలో కుటుంబ సభ్యుల, మిత్రులు, నాయకులు కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత అరుణ్‌కుమార్ మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, తదితరులు నివాళి అర్పించారు. అనంతరం ప్రజా సమస్యలపై అరుణ్‌కుమార్ చేసిన పోరాటాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడిరాజు, రెహమాన్, వాండ్రాసి సత్యనారాయణ పాల్గొన్నారు.


అరుణ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

తిరుపతి, చర్లపల్లికి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి, విశాఖ-చర్లపల్లి మధ్య నడస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-తిరుపతి-విశాఖ : 08547 నంబరు గల రైలు జూన్ నాలుగు నుంచి జూలై 30 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు జూన్ ఐదు నుంచి జూలై 31వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి. విశాఖ-చర్లపల్లి-విశాఖ : 08579 నంబరు గల రైలు జూన్ ఆరు నుంచి జూలై 25 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల రైలు జూన్ ఏడు నుంచి జూలై 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

వైసీపీ నేత భూ మాయ

... 5వ పేజీ తరువాయి

బయటపడుతుందని చెబుతున్నారు.

విచారణ చేపడతాం

- ఎం.ఆనంద్‌కుమార్, తహశీల్దార్, పెందుర్తి

పెదగాడి సర్వే నంబరు 420లో 4.75 ఎకరాల చెరువు అతుకుబడి పట్టాలపై శాఖాపరమైన విచారణ చేపడతాం. స్థానిక రెవెన్యూ కార్యాలయం రికార్డుల్లో 1978లో అతుకుబడి అనుభవదారుల వివరాలు, డీ పట్టాలు జారీచేసిన వారి పేర్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అంశంపై సమగ్ర పరిశీలన చేస్తాం. చెరువు క్లాసిఫికేషన్‌పై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

'వరుణ్'కు వరాలు

... 5వ పేజీ తరువాయి

గుర్తించి సంస్థ కోరిన రాయితీలు ఇవ్వాలని సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఈ నెల 15వ తేదీన సమావేశమై రాయితీలను ఇవ్వవచ్చునని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాని ప్రకారం వరుణ్ హాస్పిటాలిటీ సంస్థకు దిగువ పేర్కొన్న రాయితీలన్నీ లభిస్తాయి. అంతేకాకుండా నోవాటెల్ నుంచి ఇటు వైపు ఉన్న వరుణ్ హాస్పటాలిటీ భవన సముదాయానికి ఐకానిక్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా నిర్మించాలని ప్రభుత్వం సూచించింది. ఈ బాధ్యతను వీఎంఆర్‌డీఏకు అప్పగించింది. అంటే రోడ్డుకు అటు ఇటు ఉండే హోటళ్లను కలుపుతూ అందమైన డిజైన్డ్ బ్రిడ్జి నిర్మిస్తారు.

రైల్వే జోన్ పనులకు శ్రీకారం

... 5వ పేజీ తరువాయి

ప్రకటిస్తే...అందులో ప్రతి పనికి నిర్దేశిత సమయం ఇచ్చి గడువు పెట్టాలి. ఏ తేదీకి పూర్తి చేయాలో స్పష్టంచేయాలి. వాటిని పర్యవేక్షించడానికి జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నియమించాలి. ఆయన విధులు నిర్వహించడానికి అవసరమైన భవనం కేటాయించాలి. ఇవన్నీ జరిగితే దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు మొదలైపోతాయి. ఇదంతా ఒడిశా నాయకులకు ఇష్టం లేదు. తూర్పు కోస్తా జోన్ పెత్తనమే ఇంకా కొన్నాళ్లు సాగాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే విశాఖ జోన్ పనులు జాప్యం చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీబయలుదేరిన సీఎం చంద్రబాబునాయుడు...కేంద్ర మంత్రిని కలిసినప్పుడు విశాఖ జోన్ గెజిట్ గురించి ప్రస్తావించి, పనులు వేగవంతం చేయాలని కోరితే తప్ప ఇక్కడ స్పీడ్ అందుకోవు. విశాఖ జోన్ త్వరగా పనిచేయాలంటే ఢిల్లీలో ఒత్తిడి పెట్టాల్సిందేనని రైల్వే వర్గాలు బలంగా కోరుకుంటున్నాయి. ఇది ఎంపీల వల్ల సాధ్యం కావడం లేదని ముఖ్యమంత్రి స్థాయి నాయకులే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

ఏయూ దూర విద్య ప్రాక్టికల్స్‌కు కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

రూ.3 వేలు, ప్రాక్టికల్స్‌కు కూడా హాజరుకాలేకపోతే మరో మూడు వేలు...మొత్తం రూ.6 వేలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థుల నుంచి ఆయా కాలేజీలు డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు.

వర్సిటీ ఆదాయానికి గండి

దూర విద్య కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను గతంలో ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహించేవారు. దాంతో పకడ్బందీగా జరిగేవి. అయితే, కొన్నాళ్ల కిందట ఈ విధానంలో వర్సిటీ అధికారులు మార్పులు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహించుకునే అవకాశం ప్రైవేటు కాలేజీలకు ఇచ్చారు. అదే ఆయా కాలేజీలకు ఆదాయ వనరుగా మారుతోంది. మరోవైపు వర్సిటీ ఆదాయానికి కూడా గండి పడుతోంది. ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి కాలేజీకి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ యూనివర్సిటీ చెల్లిస్తుంది. ప్రాక్టికల్స్, తరగతుల నిర్వహణ, సిబ్బంది టీఏ, డీఏల కోసం ఈ మొత్తాన్ని యూనివర్సిటీ అధికారులు చెల్లిస్తారు. అయితే, అక్కడ ప్రక్రియ సక్రమంగా జరగనప్పుడు నిధులు వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ కాలేజీలకు వీటి నిర్వహణ బాధ్య తలను అప్పగిస్తే ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. దీనిపై దూరవిద్య కేంద్రం డైరెక్టర్ విజయ్‌మోహన్‌ను వివరణ కోరగా...వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అటువంటిదేమైనా జరిగినట్టయితే కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు అబ్జర్వర్స్‌ను నియమిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- సందడిగా మినీ మహానాడు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు
- కష్ట పడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని హామీ



మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, వేదికపై పలువురు టీడీపీ నేతలు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పలువురు టీడీపీ నేతలు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజకవర్గం మినీ మహానాడును గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నాయకత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టర్-1లోని పునఃనిర్మించిన వుడా కల్యాణ మండపంలో జరిగిన ఈ మహానాడు కార్యక్రమంలో తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన మినీ మహానాడులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. తాను నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రతిసారి ప్రజల అదరాభిమానాలు పెరుగుతూ వచ్చాయని, జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన మెజారిటీ పెరిగిందని, దీన్ని బట్టి తూర్పు నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని చెప్పవచ్చన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. గత ఐదు సంవత్సరాలలో తూర్పు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగకపోగా, ఉన్న అభివృద్ధి నాశనం చేసే యత్నం చేశారని విమర్శించారు, అయినప్పటికీ ప్రజలకు టీడీపీపై అభిమానం ఏ మాత్రం తగ్గకపోగా గత ప్రభుత్వ కుళ్లుకు తంత్రాలకు ఎన్నికల్లో ఘాటైన సమాధానం కూడా చెప్పారన్నారు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, యూజీడీ పనులు, కొండవాలులో రక్షణ గోడల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అలాగే నగరంలో మెట్రో, ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వస్తాయని, ఆరిలోవలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు. సింహాచలం భూముల సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఆరిలోవ రైతుబజార్‌ను త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. ఆర్థికపరమైన సమస్యలున్నా.. 'తల్లికి వందనం' ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. కష్టపడే ప్రతి కార్యకర్తకూ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల్లో తూర్పు నియోజకవర్గానికి ప్రాధాన్యాన్ని అధిష్ఠానం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూసి ప్రతి నాయకుడు ఎంతో నేర్చుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితే రాష్ట్రం అయోమయానికి లోనవుతుందని రాష్ట్ర ప్రజలు స్పష్టంగా సమాధానమిచ్చారన్నారు. ప్రజలు జగన్‌పై చూపిస్తున్న వ్యతిరేకత ఆయనకు బుద్ధి చెప్పే విధంగా ఉందని వ్యాఖ్యానించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చోడే వెంకట పట్టాభిరామ్, ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్లు రామలక్ష్మి, లావణ్య, సునీత, అప్పారి శ్రీవిద్య, నూకరత్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరుగున పడిన అభివృద్ధి తిరిగి పుంజుకుంటోందని, అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు ప్రయత్నిస్తోందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారు శోభ, టీడీపీ నాయకులు బుడుమూరి గోవింద్, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నారు గోపి, ముగడ వాసు, నెక్కంటి సత్తిబాబు, మార్ని బాపిరాజు, మజ్జి రమణి, పల్లా ఉమారాణి, ఒమ్మి అప్పలరాజు, ధర్మారావు, బైరెడ్డి పోతన్నరెడ్డి, బొట్టా వెంకటరమణ, గొలగాని పోలారావు, అప్పారి గిరిబాబు, నరేంద్ర, ఒమ్మి అప్పారావు, వరలక్ష్మి, ఆళ్ల శ్రీనివాస్, జి.అప్పన్న, బోను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

- రిజర్వాయర్ల తనిఖీ తప్పనిసరి
- టెస్టింగ్ చేసిన తర్వాతే నీటిని అందించాలి
- నీటి సరఫరా విభాగం అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో గల నీటి రిజర్వాయర్లను నిత్యం సందర్శించి సంబంధిత నీటి పంపుహౌస్‌లను, నీటి నాణ్యతను తనిఖీలు నిర్వహిస్తూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేలా నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతను నిత్యం పరీక్షించి సరఫరా చేయాలన్నారు. జీవీఎంసీకి తాగునీరు అందించే ప్రధాన వనరులైన ఏలేరు, తాటిపూడి, రైవాడ, గోస్తని, గంభీరం, ముడసర్లోవ, మేఘాద్రి గెడ్డ, శారదా నది నుంచి నగర ప్రజలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎంత నీరు సరఫరా అవుతుందని, వాటి నిర్వహణ ఖర్చుపై ఆరా తీశారు. నగరంలో ప్రజలకు తాగు నీరు సరఫరా చేసే పంపు హౌస్‌లు, వాటర్ ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణకు సంబందించిన విద్యుత్ బిల్లులు, ఎంతమంది అధికారుల, సిబ్బంది విదులు నిర్వహిస్తున్నారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది అధికారులు రిజర్వాయర్లను, పంపుహౌస్‌లను తనిఖీలు నిర్వహించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. రిజర్వాయర్లు, పంపింగ్ హౌస్‌లను ఆకస్మికంగా సందర్శిస్తానని మేయర్ తెలిపారు. ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, ల్యాండ్ బేస్‌పై ఉన్న సోలార్ ప్లాంట్ వల్ల జీవీఎంసీకి ఎంత విద్యుత్ ఆదా అవుతుందని ఆరా తీశారు. పలు ప్రభుత్వ సంస్థల నుంచి జీవీఎంసీకి చెల్లించాల్సిన నీటి చార్జీలు రూ.37 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. కొందరు అధికారులు సరైన సమాచారం అందించలేకపోవడంతో ప్రాజెక్టులపై అవగాహన రాహిత్యం తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.పూర్తి సమాచారంతో తర్వాత సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు కె.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కేఎస్వీ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్ ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ గణితం పరీక్ష : డీఈవో

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం పదో తరగతి గణితం సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలపారు. జిల్లాలో 2606 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా, 2204 మంది మత్రమే హజరు అయ్యారన్నారు. 402 మంది గైర్హాజరైనట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాలను 17 స్క్వాడ్ బృందాలు సందర్శించాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదన్నారు. జిల్లా ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ పరీక్షలు 8 కేంద్రాలలో గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్ష జరగగా 512 మంది విద్యార్థులకు 455 మంది హాజరైనట్టు చెప్పారు. ఈ పరీక్షకు 57మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షకు సంబంధించి భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం పరీక్షలకు 5 కేంద్రాల్లో 418 మంది విద్యార్థులకు 368 మంది హాజరైనట్టు తెలిపారు. వీరిలో 50 మంది హాజరు కాలేదన్నారు. భీమిలి మండలంలో ఒక పరీక్షా కేంద్రంలో 3 విద్యార్థులు మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతుండగా, స్క్వాడ్ బృందం తనిఖీలో గుర్తించి డిబార్ చేయ డం జరిగిందన్నారు. మిగిలిన కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

ఈ పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగే ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు డీఈవో తెలిపారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్ధప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఘనంగా హనుమాన్ జయంతి



కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆరిలోవ : అన్నసమారాధనను ప్రారంభిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని ఆంజనేయ స్వామిఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామసేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, పీల జోష్యుల దంపతులతో పాటు సంఘం పెద్దలు, గ్రామస్థులు పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, నిమ్మకాయలు, సిందూరంతో స్వామికి అభిషేకాలు చేశారు.

ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకుడు నరసింహాశర్మ భక్తుల పేరిట అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురష్కరించుకుని హనుమంతువాక జంక్షన్‌లో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతా ప రుద్ర, టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరి గోవింద్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఐటీడీపీ ఇన్‌చార్జి బాదరు బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

తొలగించిన స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్



మద్దిలపాలెంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్రలు చేస్తోందన్నారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా ఉత్పత్తి తగ్గుతుందని, నష్టాల్లో ఉందని చూపించి కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేయడానికి కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంటుప్రైవేటీకరణ పేరుతో 5500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.కృష్ణారావు, వి.నరేంద్రకుమార్, కె.కుమారి, పి.శంకరరావు, సింహాచలం పాల్గొన్నారు.

జూపార్కు వద్ద..



జూపార్కు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికులపై నిర్బంధం ఆపాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తసుకోవాలని, స్టీల్‌ప్లాంట్ సమ్మెకు మద్దతుగా గురువారం సాయింత్రం విశాఖ జూపార్కు కార్మికులతో కలిసి మెయిన్ రోడ్డు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం సీఐటీయూ జోన్ కార్యదర్శులు పి.వెంకటరావు, కార్యదర్శి వి.నరేంద్ర మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనే దుర్మార్గమైందన్నారు. కార్మికులపై వేధింపులు ఎంతమాత్రం తగదన్నారు. విశాఖ జూ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.అప్పలరాజు, ఎన్.నరేష్, ఎచ్చెర్ల పైడిరాజు, పి.నర్సింగరావు, శోభారాణి జూ కార్మికులు పాల్గొన్నారు.

'బదిలీల నిబంధనలు సక్రమంగా అమలు చేయాలి'

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో లోపాలను తక్షణమే సరి చేసి ఉపాధ్యాయుల్లో నెలకొని ఉన్న గందరగోళాన్ని తొలగించాలని, అందుకు విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్‌లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చల సందర్భంలో పేర్కొన్న అంశాలకు భిన్నంగా అధికారులు తీవ్ర గందరగోళం కలిగేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బదిలీల నిబంధనల అమలులో నిర్దిష్టంగా వ్యవహరించాలని, లేని పక్షంలో మళ్లీ ఉద్యమ బాట పట్టడం ఖాయమని హెచ్చరించారు.

పార్టీ బలోపేతానికి పోటీ పడండి

- వైసీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

మద్దిలపాలెం, మే22(ఆంధ్రజ్యోతి) : నాయకులను కిందకు లాగడానికి పోటీ పడకుండా వైసీపీ బలోపేతానికి పోటీపడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పేర్కొన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తూర్పు నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే పార్టీ పదవులు అవే వస్తాయన్నారు. అంతేకాని పదవుల కోసం పోటీలో ఉన్న వారిని కిందకు లాగాలనే కుట్రలు చేస్తే పార్టీకే నష్టమన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారు తప్ప ప్రజలకు మంచి చేసిందేమీలేదన్నారు. ఉత్తరాంధ్ర, విశాఖపై పక్షపాత వైఖరి చూపుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇప్పటివరకూ పైసా కేటాయించలేదన్నారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనను ఎండగట్టాలన్నారు. వైసీపీ 2019లో రాష్ట్రమంతా వైభవంగా వెలిగిన విశాఖ నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం పార్టీకి విజయం దక్కలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ నాలుగు నియోజకవర్గాల్లో సైతం విజయం సాధించి పార్టీకి గొప్ప వైభవం తీసుకురావాలన్నారు. అందుకు కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలన్నారు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి పూర్తి న్యాయం చేయడానికి అహిర్నశలు పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కలాకల్యాణి, కుంభా రవిబాబు, నాయకులు రవిరెడ్డి, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, జాన్ వెస్లీ, పేడాడ రమణకుమారి, మొల్లి లక్ష్మీ, నక్కిళ్ల లక్ష్మీ, పేర్ల విజయచందర్ పాల్గొన్నారు.

శశిధర్‌కు నృత్య యువ ప్రతిభా అవార్డు

రామ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నృత్య ప్రదర్శనలో నగరానికి చెందిన పాండ్రాడ శశిధర్ పైడిరాజుకు నృత్య యువ ప్రతిభా అవార్డు లభించింది. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ సంయు క్తంగా అంతర్జాతీయ స్థాయి లో దుబాయ్ జనరల్ ఆఫ్ ఆండియా కాన్ఫరెన్స్ హాలు లో నిర్వహించిన పోటీల్లో విశాఖ నగరానికి చెందిన సాయినాథ్ కళా కమిటీ, ఎస్‌కేఎస్ అకాడమీ బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలో శశిధర్ పైడిరాజ్ వివిధ బారతీయ నృత్య రీతులను ప్రదర్శించి పలువురి మన్నలు పొందారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా శశిధర్ నృత్య యువ ప్రతిభ అవార్డు అందుకున్నారు, ఈ సందర్భంగా శశిధర్‌ను పలువురు అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నడిరోడ్డుపై ఆవు అవస్థలు

- సకాలంలో వైద్య అందడంతో మూగజీవికి తప్పిన ప్రాణాపాయం



తీవ్రంగా గాయపడిన ఆవును సపర్యలు చేస్తున్న స్థానికులు

పెదవాల్తేరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి జంక్షన్ వద్ద గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ గోవుకు భారీ గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడి ఉన్న ఆవును స్థానికులు గుర్తించి సమర్యలు చేశారు. సమాచారం అందడంతో మూడో పట్టణ భద్రత పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సిబ్బంది, కానిస్టేబుల్ అర్జున్ ఘటనాస్థలానికి చేరుకొన్నారు. అందరూ కలిసి గాయపడిన ఆవును సపర్యలు చేశారు. అనంతరం పశువుల ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆవును జన సంచారం లేని ప్రాంతానికి తరలించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పశువైద్య సిబ్బంది వెంటనే ఆవుకు వైద్యం చేశారు. అయితే ఈ ప్రమాదంలో గోవు కాలికి తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమైంది. ఆవుకు ప్రాణహాని లేదని వైద్యులు ధ్రువీకరించారు. సమయానికి వైద్యులకు సమాచారం అందించి స్పందించిన ట్రాఫిక్ సిబ్బంది, కానిస్టేబుల్ అర్జున్‌ను స్థానికులు ప్రశంసించారు. ఆవును గాయపడడానికి కారనమైన వాహనాన్ని, వ్యక్తిని సమీప సీసీ ఫుటేజీలను పరిశీలించి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు.

పైపులైను ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నీటి విభాగాధికారులు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలోని రామాలయం వీధిలో ఎమ్మెల్యే నిధులు రూ.4 లక్షలతో ఏర్పాటు చేయనున్న నూతన పైపులైను (పెద్ద పైపులు)కు గురువారం నీటి సరఫరా విభాగం అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నాగు గోపి, ముగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

గోతులమయంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి

- కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మద్దిలపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం కూడలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో భారీ గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురతున్నారు. ఎప్పటి నుంచో ఇక్కడ పరిస్థితి ఇలాగే ఉందని, పట్టించుకునే నాథుడే లేడంటూ మండిపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదం టూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ గోతులు అంతకంతకూ పెద్దవిగా మారుతున్నాయని అంటున్నారు.

మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ లోపలకు వెళ్లే ఏ బస్సులైనా ఇదే రోడ్డులో ప్రయాణించాలి. అలాగే కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చే బస్సులు కూడా గోతులు ఏర్పడిన రోడ్డు నుంచే బయటకు రావాలి. రోజుకు వందల్లో బస్సులు ఈ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. మద్దిలపాలెం కాంప్లెక్స్‌లో కొరియర్ సర్వీస్ ఏర్పాటు చేయడంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్ల తాకిడి పెరిగింది. అయితే ఈ ప్రాంతం లో రోడ్డు గోతులమయంగా తయారై అధ్వానంగా మారడంతో తరచూ ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా.. ద్విచక్ర వాహనదారులు వాహనాలు బోల్తా పడుతుండడంతో గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే దారిలో ఏర్పడిన భారీ గోతులు

ఎందుకీ చలివేంద్రాలు..!?

- నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారిన వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రూ.కోట్లాది ప్రజా ధనం వృథా?



అపరిశుభ్రత మధ్య 51వ వార్డులోని కళింగనగర్‌లో గల చలివేంద్రం


బర్మాక్యాంప్ హైవే బస్టాప్ కామాక్షినగర్ దగ్గర నీరు లేని చలివేంద్రం

మురళీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రాలు నిర్వహణలోపం కారణంగా నిరుపయోగంగా తయారయ్యాయి. దీంతో రూ.కోట్లలో ప్రజాధనంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలుఅక్కరకు రాకుండాపోయాయని పలువురు అంటున్నారు.

ఈ ఏడాది వేసవి ప్రతాపం మార్చి నెలకు ముందే కనిపించింది. అయినప్పటికీ ఏప్రిల్ రెండో వారానికి గాని జీవీఎంసీ చలివేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అయితే వీటి నిర్వహణ విషయంలో మాత్రం అధికారులు శ్రద్ధ పెట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో చలివేంద్రం ఏర్పాటు, 45 రోజుల పాటు కొనసాగించేలా జీవీఎంసీ కాంట్రాక్టు ప్రాతిపదికన నిధులు మంజూరు చేసింది. జోన్-5 పరిధిలోని 17 వార్డుల్లో దాదాపు 45 వరకు చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో చలి వేంద్రానికి రూ.64,000 కేటాయించారు. నగర పరిధిలో మొత్తం 8 జోన్లలో కలిపి సుమారు 320 చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటి మొత్తం నిర్వహణ వ్యయం రూ.రెండు కోట్లు పైమాటే!

అయితే చాలా చలివేంద్రాలను సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చలివేంద్రం ఏర్పాటు చేసిన రోజు మినహా ఆ మరుసటి రోజు నుంచే పలు చోట్ల తాగునీటి పంపిణీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ చలివేంద్రాల్లో పాదచారులు, ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు మనుషులే ఉండడం లేదు.

ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారికి ఆనుకొని బర్మా క్యాంపు బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంలో అసలు కుండల్లో తాగునీరు పోసే నాథుడే లేరు. జీవీఎంసీ వాటర్ ట్యాంకుతో డ్రమ్ముల్లో ప్రతి చలివేంద్రంలో నీరు పోస్తోంది. వీటిని పరిశుభ్రంగా మట్టి కుండలు ఏర్పాటు చేసి, మినరల్ సప్లిమెంట్లు కలిపి, గ్లాసుల్లో పోసి బాటసారులు, ప్రయాణికులకు అందించాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం లక్షలాది రూపాయలు కేటాయించారు. కానీ, వాస్తవ చిత్రం ప్రతి ఒక్కరికీ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

జీవీఎంసీ 51వ వార్డు మాధవధార కళింగనగర్ బస్టాపు దగ్గరి చలివేంద్రంలోనూ ఇదే తీరు. ఇక్కడ టేబుల్స్ ప్రక్కకు పడిపోయి, కుండలు ఎండ బెట్టేసి ఉన్నాయి. నీరు డ్రమ్ములో ఉంటుంది. అందులో నుంచి తీసుకుని తాగే వారు తాగాలి.. లేదంటే లేదు. అక్కడి పరిసరాలు కూడా సరిగా లేకపోవడం గమనార్హం. ఇదీ జీవీఎంసీ చలివేంద్రాల నిర్వహణ తీరు. పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్, నీటి సరఫరా విభాగాల సిబ్బంది ఎంతమాత్రం పట్టించుకోకపోవడం వల్లే చలివేంద్రాల నిర్వహణ ఇంత దారుణంగా ఉందంటూ పలువురు విమర్శిస్తున్నారు. దీంతో వీటి ఏర్పాటుకు వెచ్చిస్తున్న రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని అంటున్నారు.

కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

- ప్రధాని, సీఎం, గవర్నర్ రాక
- 15 వేల మందికి ఏర్పాట్లు
- పార్క్ హోటల్ వరకు 50 వేల మందితో ఆసనాలు
- జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో వచ్చే నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక ఏర్పాటు చేసే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. యోగా డే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆయన గురువరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గవర్నర్ అబ్దున్ నజీర్ తదితర ప్రముఖులతో పాటు 15 వేల మంది హాజరవుతారన్నారు. అక్కడి నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు బీచ్ రోడ్డులో సుమారుగా 50 వేల మంది యోగాసనాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి భీమిలి వరకు ఎక్కడికక్కడ యోగాసనాల శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఆరు బృందాలు ఏర్పాట్లు చూస్తున్నాయన్నారు. పార్క్ హోటల్ నుంచి తెన్నేటి పార్క్ వరకు, అక్కడి నుంచి కైలాసగిరి వరకు, అక్కడి నుంచి రుషికొండ వరకు, అక్కడి నుంచి తిమ్మాపురం, అక్కడి నుంచి భీమిలి వరకు మరో బృందం బాధ్యత వహిస్తుందన్నారు. ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తామని, పార్కింగ్ స్థలాలు కూడా కేటాయిస్తామని, అక్కడి నుంచి కంపార్ట్‌మెంట్లకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఉంటుందన్నారు. ప్రతి బృందంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జోనల్ కమిషనర్, తహసీల్దార్, 20 మంది వలంటీర్లు ఉంటారన్నారు. యోగాసనాల కోసం ఏర్పాటు చేసే కంపార్ట్‌మెంట్ ఒక్కొక్కటి 200 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు ఉండాలని అధికారులకు సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు అతిథులు వస్తారని, ఎవరు.. ఎక్కడికి ఎలా వెళ్లాలో సూచించే విధంగా బోర్డులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవంలో 2.5 లక్షల మందిని భాగస్వాములుగా చేయాలని ఆదేశించారు.అంతా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథుర్, స్పెషల్ సబ్ కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదనరావు పాల్గొన్నారు.

ముస్లిం తాటిచెట్లపాలెంలో అంధకారం

- కొన్నాళ్లుగా వెలగని వీధి దీపాలు
- ఆకతాయిలకు అడ్డాగా పరిసరాలు


వీధి దీపాలు వెలగక చీకటిమయంగా ఉన్న ముస్లిం తాటిచెట్లపాలెం సర్వీసు రోడ్డు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ జోన్-5 44వ వార్డు పరిధి ముస్లిం తాటిచెట్లపాలెంలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో చీకటిపడగానే ఆప్రాంతమంతా అంధకారంగా మారుతోంది.

అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి ఎదురుగా ముస్లిం తాటిచెట్లపాలెం మసీదు నుంచి 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం వరకూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులో వీధి దీపాలు గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం పక్కన ఉన్న రోడ్డులో కూడా రామచంద్రనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం వరకు ఉన్న రోడ్డులో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. దీనివల్ల చీకటి పడగానే ఆ ప్రాంతమంతా అసాంఘిక కార్యక్రమాలకు, ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. వీధి దీపాలు వెలగడం లేదని జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదుచేస్తే సిబ్బంది వచ్చి వీధి దీపాలను వెలిగించి వెళ్లగానే మళ్లీ ఆగిపోతున్నాయి. ఆకతాయిలు, గంజాయిబ్యాచ్‌లు ఉద్దేశ పూర్వకంగానే వీధి దీపాలను వెలగకుండా చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

రైల్వేలో అధికార భాషా అమలు కమిటీ సమావేశం

- రాజభాష అమలులో తూర్పుకోస్తా రైల్వేకు ప్రథమ స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా, పాల్గొన్న అధికారులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో గురువారం 79వ పట్టణ అధికార భాషా అమలు సమావేశం జరిగింది. ముందుగా 'విశాఖ భారతి' పత్రిక తాజా సంచికను డీఆర్ఎం లలిత్ బొహ్రా విడుదల చేశారు. అనంతరం రాజభాష హిందీ ని ప్రోత్సహించడంలో వివిధ కార్యాలయాలు సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాజబాషను ప్రోత్సహించడంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన పెద్ద కార్యాలయాల్లో తూర్పు కోస్తా రైల్వే, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్, ఎన్ఎస్‌టీఎల్ తొలి మూడు స్థానాలను సాధించగా, చిన్న కార్యాలయాల్లో కేంద్రీయ విద్యాలయం-2 (104 ఏరియా), ఎఫ్ఎస్ఐ, సీఐఎఫ్‌టీ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఆరు కార్యాలయాలకు మెమెంటోలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అధికార బాష హిందీ వినియోగం అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, హిందీ భాష ప్రాధాన్యతను తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశాఖ-భారతి పత్రిక ద్వారా నాణ్యమైన కథనాలను అందించడంతో పాటు హిందీ పై అవగాహన కల్పించే విషయాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సా హు, రాజభాషా అధికారి సంతోష్‌కుమార్, వివిధ కార్యాలయాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి, చర్లపల్లికి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి, విశాఖ-చర్లపల్లి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి-విశాఖ : 08547 నంబరు గల రైలు జూన్ నాలుగు నుంచి జూలై 30 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు జూన్ ఐదు నుంచి జూలై 31వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.

విశాఖ-చర్లపల్లి-విశాఖ : 08579 నంబరు గల రైలు జూన్ ఆరు నుంచి జూలై 25 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలోబయలుదేరి మర్నాడు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల రైలు జూన్ ఏడు నుంచి జూలై 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.


అధికారులకు బంగారు హారాన్ని అందిస్తున్న దాత శ్రీనివాసరావు

కనక మహాలక్ష్మి అమ్మవారికి బంగారు హారం బహూకరణ

మహారాణిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారికి ఓ భక్తుడు మూడున్నర లక్షల రూపాయలు విలువ చేసే 41.830 గ్రాముల బంగారు హారం బహూకరించారు.మధురవాడ ప్రాంతానికి చెందిన కె. శ్రీనివాసరావు తన తల్లి వనజాక్షి పేరు మీద ఈ హారాన్ని ఆలయ ఈఓకి గురువారం అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, వారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రం, ఆశీర్వాదం, ప్రసాదాన్ని అందించారు.

యుగ పురుషుడు ఎన్‌టీఆర్


కార్యక్రమంలో పాల్గొన్న కళా రంగ ప్రముఖులు, గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సినీ రంగంలో చరిత్ర సృష్టించారని, ఎన్నో పాత్రల ద్వారా ప్రజల మనసులో చిరకాలం నిలిచిపోయారని పలువురు సినీ కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలను ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్, విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నటరత్న కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి డి. భూపతిరావు, స్వరాంజలి సహాయ కార్యదర్శి ఎంవీఆర్ నాగేశ్వరరావు, భయ్యా శ్రీనివాస్, కృష్ణంరాజు, అల్లిబిల్లి నరసింగరావు, ఎస్. విజయకుమార్, ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వజ్రై నాంచారయ్య, గంటి మురళీ మాట్లాడుతూ ఎన్టీఆర్ పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి ప్రజలను చైతన్యవంతులను చేశారని చెప్పారు. అనంతరం గాయనీ గాయకులు ఎన్‌టీఆర్ చిత్రాల్లోని పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కల్యాణి, శ్రావణి, శాంతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

అల్లిపురం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం జెండా చెట్టు వీధిలో విజయ దుర్గాలమ్మ ఆలయ 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారికి తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దుర్గా హోమం జరిపారు. సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ స్వర్ణ పుష్పంతో అర్చనలు చేశారు.


పూర్ణా మార్కెట్‌లో ఉన్న ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



నిమ్మకాయలు, తమలపాకులతో స్వామివారి అలంకరణ

ఘనంగా హనుమాన్ జయంతి

మహారాణిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ హనుమాన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పూర్ణామార్కెట్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆల యంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

సీతమ్మధారలో...

డాబాగార్డెన్స్ : సీతమ్మధారలోని 108 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం కోలాటం నిర్వహించారు.ఆలయ ధర్మకర్త ఏఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే పాత జైల్ రోడ్డులో ఉన్న ధ్యాన ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోపాజ్యోశ్యుల సత్యజగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

అల్లిపురం : అల్లిపురంలో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి, వెంకటేశ్వరమెట్ట అభయాంజనేయస్వామి ఆలయం, అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మర్రిపాలెంలో...

మర్రిపాలెం : మర్రిపాలెం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. మర్రిపాలెం పరిసరాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పినిశెట్టి రమణ, సభ్యులు కుసుమా శ్రీను, కొసులు ప్రసాద్, రత్నం నాగరాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే నడిచేది ఎలా ?

రైతుబజారులో మార్గానికి అడ్డంగా జంగిడీలు

అక్కయ్యపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో నడవడానికి దారి లేకుండా కుదించుకుపోతోంది. రైతులు, వ్యాపారులు ఇష్టానుసారంగా జంగిడీలు, క్రేట్లు పెడుతుండడంతో నడవడానికి వీలుండడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. ఇలా అడ్డంగా పెడితే రైతుబజారుకు వచ్చి కూరగాయలు ఎలా కొనుగోలు చేస్తామని ప్రశ్నిస్తున్నారు. రైతుబజారులో డ్వాక్రా స్టాల్స్, కూరగాయలు విక్రయించే స్టాల్స్ కిరాణా సామాన్లు విక్రయించే దుకాణాలు, వివిధ రకాల పండ్ల స్టాల్స్ ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ వినియోగదారులు రైతుబజారుకు వస్తుంటారు. దారి పొడుగునా కిరాణా సామాన్లు, వివిధ రకాల కూరగాయలు మూటలుగా పెట్టడంతో వాటిని దాటుకొని ముందుకు వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారు మార్గాన్ని సగానికి సగం వ్యాపారులే ఆక్రమించి వివిధ రకాల వస్తువులు పెట్టేస్తుంటే తాము ఎక్కడ నడవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.


మార్గమధ్యలో అడ్డంగా పెట్టిన క్రేట్లు

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశపరీక్ష

సాగర్‌నగర్/ఎండాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్న యూజీ, పిజి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజాఫణిపప్పు తెలిపారు. గురువారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యూజీ స్థాయిలో బీకామ్, బిజినెస్ ఎనలిటిక్స్, ఫైనాన్సియల్ మార్కెట్స్, జనరల్ బీబీఏ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో ఎంబీఏ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా మెడ్‌టెక్ జోన్, అకాడమీ ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబీఏ హాస్పటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 24వ తేదీలోగా గీతం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అడ్మిషన్ల డైరెక్టర్ ఎం. జగదీశ్, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లుబ్నా నిహార్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎ. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత భూ మాయ

... 5వ పేజీ తరువాయి

బయటపడుతుందని చెబుతున్నారు.

విచారణ చేపడతాం

- ఎం.ఆనంద్‌కుమార్, తహశీల్దార్, పెందుర్తి

పెదగాడి సర్వే నంబరు 420లో 4.75 ఎకరాల చెరువు అతుకుబడి పట్టాలపై శాఖాపరమైన విచారణ చేపడతాం. స్థానిక రెవెన్యూ కార్యాలయం రికార్డుల్లో 1978లో అతుకుబడి అనుభవదారుల వివరాలు, డీ పట్టాలు జారీ చేసిన వారి పేర్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అంశంపై సమగ్ర పరిశీలన చేస్తాం. చెరువు క్లాసిఫికేషన్‌పై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

'వరుణ్'కు వరాలు

... 5వ పేజీ తరువాయి

గుర్తించి సంస్థ కోరిన రాయితీలు ఇవ్వాలని సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఈ నెల 15వ తేదీన సమావేశమై రాయితీలను ఇవ్వవచ్చునని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాని ప్రకారం వరుణ్ హాస్పిటాలిటీ సంస్థకు దిగువ పేర్కొన్న రాయితీలన్నీ లభిస్తాయి. అంతేకాకుండా నోవాటెల్ నుంచి ఇటు వైపు ఉన్న వరుణ్ హాస్పటాలిటీ భవన సముదాయానికి ఐకానిక్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా నిర్మించాలని ప్రభుత్వం సూచించింది. ఈ బాధ్యతను వీఎంఆర్‌డీఏకు అప్పగించింది.

అంటే.. రోడ్డుకు అటు ఇటు ఉండే హోటళ్లను కలుపుతూ అందమైన డిజైన్డ్ బ్రిడ్జి నిర్మిస్తారు.

రైల్వే జోన్ పనులకు శ్రీకారం

... 5వ పేజీ తరువాయి

ప్రకటిస్తే...అందులో ప్రతి పనికి నిర్దేశిత సమయం ఇచ్చి గడువు పెట్టాలి. ఏ తేదీకి పూర్తిచేయాలో స్పష్టంచేయాలి. వాటిని పర్యవేక్షించడానికి జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నియమించాలి. ఆయన విధులు నిర్వహించడానికి అవసరమైన భవనం కేటాయించాలి. ఇవన్నీ జరిగితే దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు మొదలైపోతాయి. ఇదంతా ఒడిశా నాయకులకు ఇష్టం లేదు. తూర్పు కోస్తా జోన్ పెత్తనమే ఇంకా కొన్నాళ్లు సాగాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే విశాఖ జోన్ పనులు జాప్యం చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీబయలుదేరిన సీఎం చంద్రబాబునాయుడు..కేంద్ర మంత్రిని కలిసినప్పుడు విశాఖ జోన్ గెజిట్ గురించి ప్రస్తావించి, పనులు వేగవంతం చేయాలని కోరితే తప్ప ఇక్కడ స్పీడ్ అందుకోవు. విశాఖ జోన్ త్వరగా పనిచేయాలంటే ఢిల్లీలో ఒత్తిడి పెట్టాల్సిందేనని రైల్వే వర్గాలు బలంగా కోరుకుంటున్నాయి. ఇది ఎంపీల వల్ల సాధ్యం కావడం లేదని ముఖ్యమంత్రి స్థాయి నాయకులే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

ఏయూ దూర విద్య ప్రాక్టికల్స్‌కు కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

రూ.3 వేలు, ప్రాక్టికల్స్‌కు కూడా హాజరుకాలేకపోతే మరో మూడు వేలు...మొత్తం రూ.6 వేలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థుల నుంచి ఆయా కాలేజీలు డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు.

వర్సిటీ ఆదాయానికి గండి

దూర విద్య కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను గతంలో ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహించేవారు. దాంతో పకడ్బందీగా జరిగేవి. అయితే, కొన్నాళ్ల కిందట ఈ విధానంలో వర్సిటీ అధికారులు మార్పులు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహించుకునే అవకాశం ప్రైవేటు కాలేజీలకు ఇచ్చారు. అదే ఆయా కాలేజీలకు ఆదాయ వనరుగా మారుతోంది. మరోవైపు వర్సిటీ ఆదాయానికి కూడా గండి పడుతోంది. ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి కాలేజీకి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ యూనివర్సిటీ చెల్లిస్తుంది.

ప్రాక్టికల్స్, తరగతుల నిర్వహణ, సిబ్బంది టీఏ, డీఏల కోసం ఈ మొత్తాన్ని యూనివర్సిటీ అధికారులు చెల్లిస్తారు. అయితే, అక్కడ ప్రక్రియ సక్రమంగా జరగనప్పుడు నిధులు వెచ్చించాల్సిన అవసరం ఏముచ్చిం దన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ కాలేజీలకు వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తే ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. దీనిపై దూరవిద్య కేంద్రం డైరెక్టర్ విజయ్‌మోహన్‌ను వివరణ కోరగా...వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అటువంటిదేమైనా జరిగినట్టయితే కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు అబ్జర్వర్స్‌ను నియమిస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు
- సందడిగా మినీ మహానాడు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు
- కష్ట పడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని హామీ


మినీ మహానాడుకు హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, వేదికపై పలువురు టీడీపీ నేతలు


ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పలువురు టీడీపీ నేతలు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ తూర్పు నియోజకవర్గం మినీ మహానాడును గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నాయకత్వంలో ఎంవీపీ కాలనీ సెక్టర్-1లోని పునఃనిర్మించిన వుడా కల్యాణ మండపంలో జరిగిన ఈ మహానాడు కార్యక్రమంలో తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన మినీ మహానాడులో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా ముందుకు సాగుతుందన్నారు. తాను నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రతిసారి ప్రజల అదరాభిమానాలు పెరుగుతూ వచ్చాయని, జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన మెజారిటీ పెరిగిందని, దీన్ని బట్టి తూర్పు నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని చెప్పవచ్చన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారన్నారు. గత ఐదు సంవత్సరాలలో తూర్పు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగకపోగా, ఉన్న అభివృద్ధి నాశనం చేసే యత్నం చేశారని విమర్శించారు, అయినప్పటికీ ప్రజలకు టీడీపీపై అభిమానం ఏ మాత్రం తగ్గకపోగా గత ప్రభుత్వ కుళ్లకుతంత్రాలకు ఎన్నికల్లో ఘాటైన సమాధానం కూడా చెప్పారన్నారు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణం, యూజీడీ పనులు, కొండవాలులో రక్షణ గోడల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అలాగే నగరంలో మెట్రో, ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వస్తాయని, ఆరిలోవలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయన్నారు. సింహాచలం భూముల సమస్య త్వరలోనే పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. ఆరిలోవ రైతుబజార్‌ను త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. ఆర్థికపరమైన సమస్యలున్నా.. 'తల్లికి వందనం' ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడం జరగుతుందన్నారు. కష్టపడే ప్రతి కార్యకర్తకూ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల్లో తూర్పు నియోజకవర్గానికి ప్రాధాన్యాన్ని అధిష్ఠానం కల్పించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును చూసి ప్రతి నాయకుడు ఎంతో నేర్చుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితే రాష్ట్రం అయోమయానికి లోనవుతుందని రాష్ట్ర ప్రజలు స్పష్టంగా సమాధానమిచ్చారన్నారు. ప్రజలు జగన్‌పై చూపిస్తున్న వ్యతిరేకత ఆయనకు బుద్ధి చెప్పే విధంగా ఉందని వ్యాఖ్యానించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చోడే వెంకట పట్టాభిరామ్, ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్లు రామలక్ష్మి, లావణ్య, సునీత, అప్పారి శ్రీవిద్య, నూకరత్నం మాట్లాడుతూ.. రాష్ట్రంలో మరుగున పడిన అభివృద్ధి తిరిగి పుంజుకుంటోందని, అన్న ఎన్టీఆర్ ఆశయ సాధనకు అనుగుణంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు ప్రయత్నిస్తోందన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలు నారు శోభ, టీడీపీ నాయకులు బుడుమూరి గోవింద్, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, నారు గోపి, ముగడ వాసు, నెక్కంటి సత్తిబాబు, మార్ని బాపిరాజు, మజ్జి రమణి, పల్లా ఉమారాణి, ఒమ్మి అప్పలరాజు, ధర్మారావు, బైరెడ్డి పోతన్నరెడ్డి, బొట్టా వెంకటరమణ, గొలగాని పోలారావు, అప్పారి గిరిబాబు, నరేంద్ర, ఒమ్మి అప్పారావు, వరలక్ష్మి, ఆళ్ల శ్రీనివాస్, జి.అప్పన్న, బోను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు

- రిజర్వాయర్ల తనిఖీ తప్పనిసరి
- టెస్టింగ్ చేసిన తర్వాతే నీటిని అందించాలి
- నీటి సరఫరా విభాగం అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం


సమీక్ష సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో గల నీటి రిజర్వాయర్లను నిత్యం సందర్శించి సంబంధిత నీటి పంపుహౌస్‌లను, నీటి నాణ్యతను తనిఖీలు నిర్వహిస్తూ శుద్ధి చేసిన తాగునీటిని ప్రజలకు అందించేలా నీటి సరఫరా విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో ప్రజలకు అందించే తాగునీటి నాణ్యతను నిత్యం పరీక్షించి సరఫరా చేయాలన్నారు. జీవీఎంసీకి తాగునీరు అందించే ప్రధాన వనరులైన ఏలేరు, తాటిపూడి, రైవాడ, గోస్తని, గంభీరం, ముడసర్లోవ, మేఘాద్రి గెడ్డ, శారదా నది నుంచి నగర ప్రజలకు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎంత నీరు సరఫరా అవుతుందని, వాటి నిర్వహణ ఖర్చుపై ఆరా తీశారు. నగరంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పంపు హౌస్‌లు, వాటర్ ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటులు ఎన్ని ఉన్నాయని, వాటి నిర్వహణకు సంబంధించిన విద్యుత్ బిల్లులు, ఎంతమంది అధికారుల, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు వంటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చాలా మంది అధికారులు రిజర్వాయర్లను, పంపుహౌస్‌లను తనిఖీలు నిర్వహించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. రిజర్వాయర్లు, పంపింగ్ హౌస్‌లను ఆకస్మికంగా సందర్శిస్తానని మేయర్ తెలిపారు. ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, ల్యాండ్ బేస్‌పై ఉన్న సోలార్ ప్లాంట్ వల్ల జీవీఎంసీకి ఎంత విద్యుత్ ఆదా అవుతుందని ఆరా తీశారు. పలు ప్రభుత్వ సంస్థల నుంచి జీవీఎంసీకి చెల్లించాల్సిన నీటి చార్జీలు రూ.37 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. కొందరు అధికారులు సరైన సమాచారం అందించలేకపోవడంతో ప్రాజెక్టులపై అవగాహన రాహిత్యం తగదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.పూర్తి సమాచారంతో తర్వాత సమావేశానికి హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీరు కె.శివప్రసాదరాజు, పర్యవేక్షక ఇంజనీర్ కేవీఎన్ రవి, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళీకృష్ణ, సుధాకర్, శ్రీనివాస్ ప్రసాద్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ గణితం పరీక్ష : డీఈవో

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం పదో తరగతి గణితం సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలపారు. జిల్లాలో 2606 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సివుండగా, 2204 మంది మాత్రమే హాజరు అయ్యారన్నారు. 402 మంది గైర్హాజరైనట్టు చెప్పారు. పరీక్ష కేంద్రాలను 17 స్క్వాడ్ బృందాలు సందర్శించాయన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగలేదన్నారు. జిల్లా ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ పరీక్షలు 8 కేంద్రాలలో గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం పరీక్ష జరగగా 512 మంది విద్యార్థులకు 455 మంది హాజరైనట్టు చెప్పారు. ఈ పరీక్షకు 57మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షకు సంబంధించి భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం పరీక్షలకు 5 కేంద్రాల్లో 418 మంది విద్యార్థులకు 368 మంది హాజరైనట్టు తెలిపారు. వీరిలో 50 మంది హాజరు కాలేదన్నారు. భీమిలి మండలంలో ఒక పరీక్షా కేంద్రంలో 3 విద్యార్థులు మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతుండగా, స్క్వాడ్ బృందం తనిఖీలో గుర్తించి డిబార్ చేయ డం జరిగిందన్నారు. మిగిలిన కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

ఈ పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి అక్రమాలు జరిగే ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టు డీఈవో తెలిపారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం)సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహా (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఘనంగా హనుమాన్ జయంతి


కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆరిలోవ : అన్నసమారాధనను ప్రారంభిస్తున్న వెలగపూడి ప్రతాపరుద్ర

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని ఆంజనేయ స్వామిఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామసేవా సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, పీల జోష్యుల దంపతులతో పాటు సంఘం పెద్దలు, గ్రామస్థులు పాల్గొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, నిమ్మకాయలు, సిందూరంతో స్వామికి అభిషేకాలు చేశారు.

ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చాకుడు నరసింహాశర్మ భక్తుల పేరిట అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురష్కరించుకుని హనుమంతువాక జంక్షన్‌లో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతా ప రుద్ర, టీడీపీ 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరి గోవింద్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం ఐటీడీపి ఇన్‌చార్జి బాదరు బాలరాజు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి పోటీ పడండి

- వైసీపీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

మద్దిలపాలెం, మే22(ఆంధ్రజ్యోతి) : నాయకులను కిందకు లాగడానికి పోటీ పడకుండా వైసీపీ బలోపేతానికి పోటీపడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు పేర్కొన్నారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన తూర్పు నియోజకవర్గం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే పార్టీ పదవులు అవే వస్తాయన్నారు. అంతేకాని పదవుల కోసం పోటీలో ఉన్న వారిని కిందకు లాగాలనే కుట్రలు చేస్తే పార్టీకే నష్టమన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపులకు పాల్పడుతున్నారు తప్ప ప్రజలకు మంచి చేసిందేమీలేదన్నారు. ఉత్తరాంధ్ర, విశాఖపై పక్షపాత వైఖరి చూపుతుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇప్పటివరకూ పైసా కేటాయించలేదన్నారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనను ఎండగట్టాలన్నారు. వైసీపీ 2019లో రాష్ట్రమంతా వైభవంగా వెలిగిన విశాఖ నాలుగు నియోజకవర్గాల్లో మాత్రం పార్టీకి విజయం దక్కలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ నాలుగు నియోజకవర్గాల్లో సైతం విజయం సాధించి పార్టీకి గొప్ప వైభవం తీసుకురావాలన్నారు. అందుకు కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలన్నారు. తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో కట్టబెట్టిన పదవికి పూర్తి న్యాయం చేయడానికి అహిర్నశలు పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నేతలందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు వరుదు కలాకల్యాణి, కుంభా రవిబాబు, నాయకులు రవిరెడ్డి, పల్లా దుర్గారావు, పీతల గోవింద్, జాన్ వెస్లీ, పేడాడ రమణకుమారి, మొల్లి లక్ష్మీ, నక్కిళ్ల లక్ష్మీ, పేర్ల విజయచందర్ పాల్గొన్నారు.

శశిధర్‌కు నృత్య యువ ప్రతిభా అవార్డు

రామ్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : భారతీయ నృత్య ప్రదర్శనలో నగరానికి చెందిన పాండ్రాడ శశిధర్ పైడిరాజుకు నృత్య యువ ప్రతిభా అవార్డు లభించింది. పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ, పిరమిడ్ యోగా అండ్ డ్యాన్స్ అకాడమీ సంయు క్తంగా అంతర్జాతీయ స్థాయి లో దుబాయ్ జనరల్ ఆఫ్ ఆండియా కాన్ఫరెన్స్ హాలు లో నిర్వహించిన పోటీల్లో విశాఖ నగరానికి చెందిన సాయినాథ్ కళా కమిటీ, ఎస్‌కేఎస్ అకాడమీ బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలో శశిధర్ పైడిరాజ్ వివిధ బారతీయ నృత్య రీతులను ప్రదర్శించి పలువురి మన్నలు పొందారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా శశిధర్ నృత్య యువ ప్రతిభ అవార్డు అందుకున్నారు, ఈ సందర్భంగా శశిధర్‌ను పలువురు అభినందించారు.

తొలగించిన స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- సీఐటీయూ డిమాండ్


మద్దిలపాలెంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మద్దిలపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా మద్దిలపాలెం ఆర్టీసీ డిపో వద్ద సీఐటీయూ గురువారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కుట్రలు చేస్తోందన్నారు. విశాఖ ఉక్కుకు సొంతగనులు కేటాయించకుండా ఉత్పత్తి తగ్గుతుందని, నష్టాల్లో ఉందని చూపించి కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేయడానికి కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంటుప్రైవేటీకరణ పేరుతో 5500 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంటు ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.కృష్ణారావు, వి.నరేంద్రకుమార్, కె.కుమారి, పి.శంకరరావు, సింహాచలం పాల్గొన్నారు.

జూపార్కు వద్ద..


జూపార్కు వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు కాంట్రాక్ట్ కార్మికులపై నిర్బంధం ఆపాలని, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తనుకోవాలని, స్టీల్‌ప్లాంట్ సమ్మెకు మద్దతుగా గురువారం సాయింత్రం విశాఖ జూపార్కు కార్మికులతో కలిసి మెయిన్ రోడ్డు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం సీఐటీయూ జోన్ కార్యదర్శులు పి.వెంకటరావు, కార్యదర్శి వి.నరేంద్ర మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనే దుర్గార్మమైందన్నారు. కార్మికులపై వేధింపులు ఎంతమాత్రం తగదన్నారు. విశాఖ జూ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.అప్పలరాజు, ఎస్.నరేష్, ఎచ్చెర్ల పైడిరాజు, పి.నర్సింగరావు, శోభారాణి జూ కార్మికులు పాల్గొన్నారు.

'బదిలీల నిబంధనలు సక్రమంగా అమలు చేయాలి'

ఆరిలోవ, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో లోపాలను తక్షణమే సరి చేసి ఉపాధ్యాయుల్లో నెలకొని ఉన్న గందరగోళాన్ని తొలగించాలని, అందుకు విద్యాశాఖాధికారులు తగు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్‌లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో చర్చల సందర్భంలో పేర్కొన్న అంశాలకు భిన్నంగా అధికారులు తీవ్ర గందరగోళం కలిగేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. బదిలీల నిబంధనల అమలులో నిర్దిష్టంగా వ్యవహరించాలని, లేని పక్షంలో మళ్లీ ఉద్యమ బాట పట్టడం ఖాయమని హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో
నడిరోడ్డుపై ఆవు అవస్థలు

- సకాలంలో వైద్య అందడంతో మూగజీవికి తప్పిన ప్రాణాపాయం


తీవ్రంగా గాయపడిన ఆవును సపర్యలు చేస్తున్న స్థానికులు

పెదవాల్తేరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి జంక్షన్ వద్ద గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ గోవుకు భారీ గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావమై రోడ్డుపై పడి ఉన్న ఆవును స్థానికులు గుర్తించి సమర్యలు చేశారు. సమాచారం అందడంతో మూడో పట్టణ భద్రత పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ సిబ్బంది, కానిస్టేబుల్ అర్జున్ ఘటనాస్థలానికి చేరుకొన్నారు. అందరూ కలిసి గాయపడిన ఆవును సపర్యలు చేశారు. అనంతరం పశువుల ఆస్పత్రి సిబ్బందికి సమాచారం అందించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆవును జన సంచారం లేని ప్రాంతానికి తరలించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పశువైద్య సిబ్బంది వెంటనే ఆవుకు వైద్యం చేశారు. అయితే ఈ ప్రమాదంలో గోవు కాలికి తీవ్ర గాయం కావడంతో రక్తస్రావమైంది. ఆవుకు ప్రాణహాని లేదని వైద్యులు ధ్రువీకరించారు. సమయానికి వైద్యులకు సమాచారం అందించి స్పందించిన ట్రాఫిక్ సిబ్బంది, కానిస్టేబుల్ అర్జున్‌ను స్థానికులు ప్రశంసించారు. ఆవును గాయపడడానికి కారనమైన వాహనాన్ని, వ్యక్తిని సమీప సీసీ ఫుటేజీలను పరిశీలించి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ట్రాఫిక్ సిబ్బంది తెలిపారు.

పైపులైను ఏర్పాటుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నీటి విభాగాధికారులు

వెంకోజీపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు ఇసుకతోట ప్రాంతంలోని రామాలయం వీధిలో ఎమ్మెల్యే నిధులు రూ.4 లక్షలతో ఏర్పాటు చేయనున్న నూతన పైపులైను (పెద్ద పైపులు)కు గురువారం నీటి సరఫరా విభాగం అధికారులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ 16వ వార్డు అధ్యక్షుడు నాగు గోపి, ముగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

గోతులమయంగా ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి

- కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

మద్దిలపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం కూడలి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో భారీ గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురతున్నారు. ఎప్పటి నుంచో ఇక్కడ పరిస్థితి ఇలాగే ఉందని, పట్టించుకునే నాథుడే లేడంటూ మండిపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదం టూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ గోతులు అంతకంతకూ పెద్దవిగా మారుతున్నాయని అంటున్నారు.

మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ లోపలకు వెళ్లే ఏ బస్సులైనా ఇదే రోడ్డులో ప్రయాణించాలి. అలాగే కాంప్లెక్స్ నుంచి బయటకు వచ్చే బస్సులు కూడా గోతులు ఏర్పడిన రోడ్డు నుంచే బయటకు రావాలి. రోజుకు వందల్లో బస్సులు ఈ మార్గం నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. మద్దిలపాలెం కాంప్లెక్స్‌లో కొరియర్ సర్వీస్ ఏర్పాటు చేయడంతో ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్ల తాకిడి పెరిగింది. అయితే ఈ ప్రాంతం లో రోడ్డు గోతులమయంగా తయారై అధ్వానంగా మారడంతో తరచూ ఇక్కడ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా.. ద్విచక్ర వాహనదారులు వాహనాలు బోల్తా పడుతుండడంతో గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.


మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే దారిలో ఏర్పడిన భారీ గోతులు

ఎందుకీ చలివేంద్రాలు..!?

- నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారిన వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- రూ.కోట్లాది ప్రజా ధనం వృథా?



అపరిశుభ్రత మధ్య 51వ వార్డులోని కళింగనగర్‌లో గల చలివేంద్రం


బర్మాక్యాంప్ హైవే బస్టాప్ కామాక్షినగర్ దగ్గర నీరు లేని చలివేంద్రం

మురళీనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో జీవీఎంసీ ఏర్పాటు చేసిన చలివేంద్రాలు నిర్వహణలోపం కారణంగా నిరుపయోగంగా తయారయ్యాయి. దీంతో రూ.కోట్లలో ప్రజాధనంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాలుఅక్కరకు రాకుండాపోయాయని పలువురు అంటున్నారు.

ఈ ఏడాది వేసవి ప్రతాపం మార్చి నెలకు ముందే కనిపించింది. అయినప్పటికీ ఏప్రిల్ రెండో వారానికి గాని జీవీఎంసీ చలివేంద్రాలను ఏర్పాటు చేయలేదు. అయితే వీటి నిర్వహణ విషయంలో మాత్రం అధికారులు శ్రద్ధ పెట్టలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక్కో చలివేంద్రం ఏర్పాటు, 45 రోజుల పాటు కొనసాగించేలా జీవీఎంసీ కాంట్రాక్టు ప్రాతిపదికన నిధులు మంజూరు చేసింది. జోన్-5 పరిధిలోని 17 వార్డుల్లో దాదాపు 45 వరకు చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో చలి వేంద్రానికి రూ.64,000 కేటాయించారు. నగర పరిధిలో మొత్తం 8 జోన్లలో కలిపి సుమారు 320 చలివేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటి మొత్తం నిర్వహణ వ్యయం రూ.రెండు కోట్లు పైమాటే!

అయితే చాలా చలివేంద్రాలను సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చలివేంద్రం ఏర్పాటు చేసిన రోజు మినహా ఆ మరుసటి రోజు నుంచే పలు చోట్ల తాగునీటి పంపిణీ చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ చలివేంద్రాల్లో పాదచారులు, ప్రయాణికులకు తాగునీరు అందించేందుకు మనుషులే ఉండడం లేదు.

ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారికి ఆనుకొని బర్మా క్యాంపు బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంలో అసలు కుండల్లో తాగునీరు పోసే నాథుడే లేరు. జీవీఎంసీ వాటర్ ట్యాంకుతో డ్రమ్ముల్లో ప్రతి చలివేంద్రంలో నీరు పోస్తోంది. వీటిని పరిశుభ్రంగా మట్టి కుండలు ఏర్పాటు చేసి, మినరల్ సప్లిమెంట్లు కలిపి, గ్లాసుల్లో పోసి బాటసారులు, ప్రయాణికులకు అందించాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం లక్షలాది రూపాయలు కేటాయించారు. కానీ, వాస్తవ చిత్రం ప్రతి ఒక్కరికీ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

జీవీఎంసీ 51వ వార్డు మాధవధార కళింగనగర్ బస్టాపు దగ్గరి చలివేంద్రంలోనూ ఇదే తీరు. ఇక్కడ టేబుల్స్ ప్రక్కకు పడిపోయి, కుండలు ఎండ బెట్టేసి ఉన్నాయి. నీరు డ్రమ్ములో ఉంటుంది. అందులో నుంచి తీసుకుని తాగే వారు తాగాలి.. లేదంటే లేదు. అక్కడి పరిసరాలు కూడా సరిగా లేకపోవడం గమనార్హం. ఇదీ జీవీఎంసీ చలివేంద్రాల నిర్వహణ తీరు. పర్యవేక్షించాల్సిన ఇంజనీరింగ్, నీటి సరఫరా విభాగాల సిబ్బంది ఎంతమాత్రం పట్టించుకోకపోవడం వల్లే చలివేంద్రాల నిర్వహణ ఇంత దారుణంగా ఉందంటూ పలువురు విమర్శిస్తున్నారు. దీంతో వీటి ఏర్పాటుకు వెచ్చిస్తున్న రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోందని అంటున్నారు.

కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

- ప్రధాని, సీఎం, గవర్నర్ రాక
- 15 వేల మందికి ఏర్పాట్లు
- పార్కు హోటల్ వరకు 50 వేల మందితో ఆసనాలు
- జేసీ మయూర్ అశోక్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో వచ్చే నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి కాళీమాత ఆలయం వద్ద ప్రధాన వేదిక ఏర్పాటు చేసే అవకాశం ఉందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. యోగా డే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆయన గురువరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితర ప్రముఖులతో పాటు 15 వేల మంది హాజరవుతారన్నారు. అక్కడి నుంచి పార్కు హోటల్ జంక్షన్ వరకు బీచ్ రోడ్డులో సుమారుగా 50 వేల మంది యోగాసనాల కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అక్కడి నుంచి భీమిలి వరకు ఎక్కడికక్కడ యోగాసనాల శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఆరు బృందాలు ఏర్పాట్లు చూస్తున్నాయన్నారు. పార్కు హోటల్ నుంచి తెన్నేటి పార్కు వరకు, అక్కడి నుంచి కైలాసగిరి వరకు, అక్కడి నుంచి రుషికొండ వరకు, అక్కడి నుంచి తిమ్మాపురం, అక్కడి నుంచి భీమిలి వరకు మరో బృందం బాధ్యత వహిస్తుందన్నారు. ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తామని, పార్కింగ్ స్థలాలు కూడా కేటాయిస్తామని, అక్కడి నుంచి కంపార్ట్‌మెంట్లకు వెళ్లేందుకు ప్రత్యేక మార్గం ఉంటుందన్నారు. ప్రతి బృందంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జోనల్ కమిషనర్, తహసీల్దార్, 20 మంది వలంటీర్లు ఉంటారన్నారు. యోగాసనాల కోసం ఏర్పాటు చేసే కంపార్ట్‌మెంట్ ఒక్కొక్కటి 200 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు ఉండాలని అధికారులకు సూచించారు. ప్రధాన వేదిక నుంచి పార్కు హోటల్ వరకు అతిథులు వస్తారని, ఎవరు.. ఎక్కడికి ఎలా వెళ్లాలో సూచించే విధంగా బోర్డులు కూడా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవంలో 2.5 లక్షల మందిని భాగస్వాములుగా చేయాలని ఆదేశించారు.అంతా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, భీమిలి ఆర్డీఓ సంగీత్ మాథుర్, స్పెషల్ సబ్ కలెక్టర్లు సుధాసాగర్, మధుసూదనరావు పాల్గొన్నారు.

ముస్లిం తాటిచెట్లపాలెంలో అంధకారం

- కొన్నాళ్లుగా వెలగని వీధి దీపాలు
- ఆకతాయిలకు అడ్డాగా పరిసరాలు


వీధి దీపాలు వెలగక చీకటిమయంగా ఉన్న ముస్లిం తాటిచెట్లపాలెం సర్వీసు రోడ్డు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ జోన్-5 44వ వార్డు పరిధి ముస్లిం తాటిచెట్లపాలెంలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో చీకటిపడగానే ఆప్రాంతమంతా అంధకారంగా మారుతోంది.

అక్కయ్యపాలెం పోర్టు ఆస్పత్రి ఎదురుగా ముస్లిం తాటిచెట్లపాలెం మసీదు నుంచి 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం వరకూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డులో వీధి దీపాలు గత కొన్నాళ్లుగా వెలగడం లేదు. 'ఆంధ్రజ్యోతి' కార్యాలయం పక్కన ఉన్న రోడ్డులో కూడా రామచంద్రనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం వరకు ఉన్న రోడ్డులో కూడా వీధి దీపాలు వెలగడం లేదు. దీనివల్ల చీకటి పడగానే ఆ ప్రాంతమంతా అసాంఘిక కార్యక్రమాలకు, ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. వీధి దీపాలు వెలగడం లేదని జీవీఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదుచేస్తే సిబ్బంది వచ్చి వీధి దీపాలను వెలిగించి వెళ్లగానే మళ్లీ ఆగిపోతున్నాయి. ఆకతాయిలు, గంజాయిబ్యాచ్‌లు ఉద్దేశ పూర్వకంగానే వీధి దీపాలను వెలగకుండా చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

రైల్వేలో అధికార భాషా అమలు కమిటీ సమావేశం

- రాజభాష అమలులో తూర్పుకోస్తా రైల్వేకు ప్రథమ స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా, పాల్గొన్న అధికారులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో గురువారం 79వ పట్టణ అధికార భాషా అమలు సమావేశం జరిగింది. ముందుగా 'విశాఖ భారతి' పత్రిక తాజా సంచికను డీఆర్ఎం లలిత్ బొహ్రా విడుదల చేశారు. అనంతరం రాజభాష హిందీ ని ప్రోత్సహించడంలో వివిధ కార్యాలయాలు సాధించిన పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది రాజబాషను ప్రోత్సహించడంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన పెద్ద కార్యాలయాల్లో తూర్పు కోస్తా రైల్వే, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్, ఎన్ఎస్‌టీఎల్ తొలి మూడు స్థానాలను సాధించగా, చిన్న కార్యాలయాల్లో కేంద్రీయ విద్యాలయం-2 (104 ఏరియా), ఎఫ్ఎస్ఐ, సీఐఎఫ్‌టీ తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఆరు కార్యాలయాలకు మెమెంటోలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అధికార బాష హిందీ వినియోగం అమలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, హిందీ భాష ప్రాధాన్యతను తెలియజేసే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విశాఖ-భారతి పత్రిక ద్వారా నాణ్యమైన కథనాలను అందించడంతో పాటు హిందీ పై అవగాహన కల్పించే విషయాలను తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సా హు, రాజభాషా అధికారి సంతోష్‌కుమార్, వివిధ కార్యాలయాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి, చర్లపల్లికి ప్రత్యేక రైళ్లు పొడిగింపు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-తిరుపతి, విశాఖ-చర్లపల్లి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-తిరుపతి-విశాఖ : 08547 నంబరు గల రైలు జూన్ నాలుగు నుంచి జూలై 30 వరకు ప్రతి బుధవారం రాత్రి 7.00 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08548 నంబరు గల రైలు జూన్ ఐదు నుంచి జూలై 31వ తేదీ వరకు ప్రతి గురువారం రాత్రి 9.50 గంటలకు తిరుపతిలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 11.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.


విశాఖ-చర్లపల్లి-విశాఖ : 08579 నంబరు గల రైలు జూన్ ఆరు నుంచి జూలై 25 వరకు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖలోబయలుదేరి మర్నాడు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08580 నంబరు గల రైలు జూన్ ఏడు నుంచి జూలై 26 వరకు ప్రతి శనివారం రాత్రి 7.00 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మర్నాడు ఉదయం 8.00 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులకు రెండు సెకెండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయి.


అధికారులకు బంగారు హారాన్ని అందిస్తున్న దాత శ్రీనివాసరావు

కనక మహాలక్ష్మి అమ్మవారికి బంగారు హారం బహూకరణ

మహారాణిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : కనక మహాలక్ష్మి అమ్మవారికి ఓ భక్తుడు మూడున్నర లక్షల రూపాయలు విలువ చేసే 41.830 గ్రాముల బంగారు హారం బహూకరించారు.మధురవాడ ప్రాంతానికి చెందిన కె. శ్రీనివాసరావు తన తల్లి వనజాక్షి పేరు మీద ఈ హారాన్ని ఆలయ ఈఓకి గురువారం అందజేశారు. అధికారులు దాత కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, వారి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, శేషవస్త్రం, ఆశీర్వాదం, ప్రసాదాన్ని అందించారు.

యుగ పురుషుడు ఎన్‌టీఆర్


కార్యక్రమంలో పాల్గొన్న కళా రంగ ప్రముఖులు, గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ సినీ రంగంలో చరిత్ర సృష్టించారని, ఎన్నో పాత్రల ద్వారా ప్రజల మనసులో చిరకాలం నిలిచిపోయారని పలువురు సినీ కళా రంగ ప్రముఖులు పేర్కొన్నారు. గురువారం పౌర గ్రంథాలయంలో ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలను ఆల్ ఫ్రెండ్స్ మ్యూజిక్ అసోసియేషన్, విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నటరత్న కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి డి. భూపతిరావు, స్వరాంజలి సహాయ కార్యదర్శి ఎంవీఆర్ నాగేశ్వరరావు, భయ్యా శ్రీనివాస్, కృష్ణంరాజు, అల్లిబిల్లి నరసింగరావు, ఎస్. విజయకుమార్, ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వర్రె నాంచారయ్య, గంటి మురళీ మాట్లాడుతూ ఎన్టీఆర్ పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో గొప్ప పాత్రలు పోషించి ప్రజలను చైతన్యవంతులను చేశారని చెప్పారు. అనంతరం గాయనీ గాయకులు ఎన్‌టీఆర్ చిత్రాల్లోని పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కల్యాణి, శ్రావణి, శాంతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

అల్లిపురం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అల్లిపురం జెండా చెట్టు వీధిలో విజయ దుర్గాలమ్మ ఆలయ 24వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారికి తొలుత ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో దుర్గా హోమం జరిపారు. సాయంత్రం మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ స్వర్ణ పుష్పంతో అర్చనలు చేశారు.


పూర్ణా మార్కెట్‌లో ఉన్న ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ




నిమ్మకాయలు, తమలపాకులతో స్వామివారి అలంకరణ

ఘనంగా హనుమాన్ జయంతి

మహారాణిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ హనుమాన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. పూర్ణామార్కెట్ వద్ద ఉన్న అంజనేయస్వామి ఆల యంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

సీతమ్మధారలో...

డాబాగార్డెన్స్ : సీతమ్మధారలోని 108 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం కోలాటం నిర్వహించారు.ఆలయ ధర్మకర్త ఏఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే పాత జైల్ రోడ్డులో ఉన్న ధ్యాన ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోపాజ్యోశ్యుల సత్యజగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

అల్లిపురం : అల్లిపురంలో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి, వెంకటేశ్వరమెట్ట అభయాంజనేయస్వామి ఆలయం, అచ్చియ్యమ్మపేట అభయ హస్తాంజనేయస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మర్రిపాలెంలో...

మర్రిపాలెం : మర్రిపాలెం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. మర్రిపాలెం పరిసరాల్లోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పినిశెట్టి రమణ, సభ్యులు కుసుమా శ్రీను, కొసులు ప్రసాద్, రత్నం నాగరాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే నడిచేది ఎలా ?

రైతుబజారులో మార్గానికి అడ్డంగా జంగిడీలు

అక్కయ్యపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో నడవడానికి దారి లేకుండా కుదించుకుపోతోంది. రైతులు, వ్యాపారులు ఇష్టానుసారంగా జంగిడీలు, క్రేట్లు పెడుతుండడంతో నడవడానికి వీలుండడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. ఇలా అడ్డంగా పెడితే రైతుబజారుకు వచ్చి కూరగాయలు ఎలా కొనుగోలు చేస్తామని ప్రశ్నిస్తున్నారు. రైతుబజారులో డ్వాక్రా స్టాల్స్, కూరగాయలు విక్రయించే స్టాల్స్ కిరాణా సామాన్లు విక్రయించే దుకాణాలు, వివిధ రకాల పండ్ల స్టాల్స్ ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రతిరోజూ వినియోగదారులు రైతుబజారుకు వస్తుంటారు. దారి పొడుగునా కిరాణా సామాన్లు, వివిధ రకాల కూరగాయలు మూటలుగా పెట్టడంతో వాటిని దాటుకొని ముందుకు వెళ్లలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుబజారు మార్గాన్ని సగానికి సగం వ్యాపారులే ఆక్రమించి వివిధ రకాల వస్తువులు పెట్టేస్తుంటే తాము ఎక్కడ నడవాలో అర్థం కాని పరిస్థితి నెలకొందంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.


మార్గమధ్యలో అడ్డంగా పెట్టిన క్రేట్లు

25న గీతం బిజినెస్ స్కూల్ ప్రవేశపరీక్ష

సాగర్‌నగర్/ఎండాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విశాఖ, హైదరాబాద్, బెంగళూరు క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్న యూజీ, పిజి మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజాపణిపప్పు తెలిపారు. గురువారం ఆయన వర్సిటీలో విలేకరులతో మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యూజీ స్థాయిలో బీకామ్, బిజినెస్ ఎనలిటిక్స్, ఫైనాన్సియల్ మార్కెట్స్, జనరల్ బీబీఏ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో ఎంబీఏ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా మెడ్‌టెక్ జోన్, అకాడమీ ఆఫ్ హాస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబీఏ హాస్పటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు గీతం బిజినెస్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 24వ తేదీలోగా గీతం వైబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అడ్మిషన్ల డైరెక్టర్ ఎం. జగదీశ్, స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ లుబ్నా నిహర్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎ. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత భూ మాయ

... 5వ పేజీ తరువాయి

బయటపడుతుందని చెబుతున్నారు.

విచారణ చేపడతాం

- ఎం.ఆనంద్‌కుమార్, తహశీల్దార్, పెందుర్తి

పెదగాడి సర్వే నంబరు 420లో 4.75 ఎకరాల చెరువు అతుకుబడి పట్టాలపై శాఖాపరమైన విచారణ చేపడతాం. స్థానిక రెవెన్యూ కార్యాలయం రికార్డుల్లో 1978లో అతుకుబడి అనుభవదారుల వివరాలు, డీ పట్టాలు జారీ చేసిన వారి పేర్లు, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అంశంపై సమగ్ర పరిశీలన చేస్తాం. చెరువు క్లాసిఫికేషన్‌పై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

'వరుణ్'కు వరాలు

... 5వ పేజీ తరువాయి

గుర్తించి సంస్థ కోరిన రాయితీలు ఇవ్వాలని సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ ఈ నెల 15వ తేదీన సమావేశమై రాయితీలను ఇవ్వవచ్చునని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దాని ప్రకారం వరుణ్ హాస్పిటాలిటీ సంస్థకు దిగువ పేర్కొన్న రాయితీలన్నీ లభిస్తాయి. అంతేకాకుండా నోవాటెల్ నుంచి ఇటు వైపు ఉన్న వరుణ్ హాస్పటాలిటీ భవన సముదాయానికి ఐకానిక్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా నిర్మించాలని ప్రభుత్వం సూచించింది. ఈ బాధ్యతను వీఎంఆర్‌డీఏకు అప్పగించింది.

అంటే.. రోడ్డుకు అటు ఇటు ఉండే హోటళ్లను కలుపుతూ అందమైన డిజైన్డ్ బ్రిడ్జి నిర్మిస్తారు.

రైల్వే జోన్ పనులకు శ్రీకారం

... 5వ పేజీ తరువాయి

ప్రకటిస్తే...అందులో ప్రతి పనికి నిర్దేశిత సమయం ఇచ్చి గడువు పెట్టాలి. ఏ తేదీకి పూర్తిచేయాలో స్పష్టంచేయాలి. వాటిని పర్యవేక్షించడానికి జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని నియమించాలి. ఆయన విధులు నిర్వహించడానికి అవసరమైన భవనం కేటాయించాలి. ఇవన్నీ జరిగితే దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు మొదలైపోతాయి. ఇదంతా ఒడిశా నాయకులకు ఇష్టం లేదు. తూర్పు కోస్తా జోన్ పెత్తనమే ఇంకా కొన్నాళ్లు సాగాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే విశాఖ జోన్ పనులు జాప్యం చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీబయలుదేరిన సీఎం చంద్రబాబునాయుడు...కేంద్ర మంత్రిని కలిసినప్పుడు విశాఖ జోన్ గెజిట్ గురించి ప్రస్తావించి, పనులు వేగవంతం చేయాలని కోరితే తప్ప ఇక్కడ స్పీడ్ అందుకోవు. విశాఖ జోన్ త్వరగా పనిచేయాలంటే ఢిల్లీలో ఒత్తిడి పెట్టాల్సిందేనని రైల్వే వర్గాలు బలంగా కోరుకుంటున్నాయి. ఇది ఎంపీల వల్ల సాధ్యం కావడం లేదని ముఖ్యమంత్రి స్థాయి నాయకులే దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు.

ఏయూ దూర విద్య ప్రాక్టికల్స్‌కు కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

రూ.3 వేలు, ప్రాక్టికల్స్‌కు కూడా హాజరు కాలేకపోతే మరో మూడు వేలు...మొత్తం రూ.6 వేలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటికే విద్యార్థుల నుంచి ఆయా కాలేజీలు డబ్బులు వసూలు చేసినట్టు చెబుతున్నారు.

వర్సిటీ ఆదాయానికి గండి

దూర విద్య కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్స్‌ను గతంలో ప్రభుత్వ కళాశాలల్లో మాత్రమే నిర్వహించేవారు. దాంతో పకడ్బందీగా జరిగేవి. అయితే, కొన్నాళ్ల కిందట ఈ విధానంలో వర్సిటీ అధికారులు మార్పులు చేశారు. ప్రాక్టికల్స్ నిర్వహించుకునే అవకాశం ప్రైవేటు కాలేజీలకు ఇచ్చారు. అదే ఆయా కాలేజీలకు ఆదాయ వనరుగా మారుతోంది. మరోవైపు వర్సిటీ ఆదాయానికి కూడా గండి పడుతోంది. ప్రాక్టికల్స్ నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి కాలేజీకి రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకూ యూనివర్సిటీ చెల్లిస్తుంది.

ప్రాక్టికల్స్, తరగతుల నిర్వహణ, సిబ్బంది టీఏ, డీఏల కోసం ఈ మొత్తాన్ని యూనివర్సిటీ అధికారులు చెల్లిస్తారు. అయితే, అక్కడ ప్రక్రియ సక్రమంగా జరగనప్పుడు నిధులు వెచ్చించాల్సిన అవసరం ఏమొచ్చిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వర్సిటీ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ కాలేజీలకు వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తే ఖర్చు తగ్గుతుందని చెబుతున్నారు. దీనిపై దూరవిద్య కేంద్రం డైరెక్టర్ విజయ్‌మోహన్‌ను వివరణ కోరగా...వసూళ్ల విషయం తమ దృష్టికి రాలేదన్నారు. అటువంటిదేమైనా జరిగినట్టయితే కాలేజీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాక్టికల్స్ పర్యవేక్షణకు అబ్జర్వర్స్‌ను నియమిస్తామన్నారు.



పూజలందుకున్న సంపత్ వినాయకుడు

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక లోని సంపత్ వినాయక ఆలయ 26వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించాక లక్ష్మీగణపతి హోమాన్ని జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, ఎం.శ్రీను, వి.నారాయణరావు, ఎం.నరసింగరావు, జగ్గారావు, చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

29న బంగారమ్మ అనుపోత్సవం

అక్కిరెడ్డిపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): నాతయ్యపాలెం, షీలానగర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం బంగారమ్మ నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. గురువారం ఆలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు 29న అనుపోత్సవంతో ముగుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రోజూ ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, జి.వెంకటరమణ, పి.శ్రీనివాసరావు, ఎస్.సోమినాయుడు, ఎస్.శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడిగా నమ్మి అప్పారావు



పెదగంట్యాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 75వ వార్డు అధ్యక్షుడిగా సీతానగరం నిర్వాసిత కాలనీకి చెందిన నమ్మి అప్పారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ తనపై నమ్మకంతో పార్టీ అధిష్టానం రెండోసారి వార్డు అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించడం ఎంతో ఆనందంగా ఉంద న్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

గాజువాక, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు నిత్యం క్రీడల్లో పాల్గొంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గాజువాక హైస్కూల్ పీడీ స్వాతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో ఆమె ఆమె పాల్గొని మాట్లాడారు. వాకింగ్ చేయడం, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 34, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 16, క్యారెట్ 38 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 30, బద్దచిక్కుడు 40, నిమ్మకాయలు (కిలో) 80, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 94, కీరదోస 34, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 64, గోరుచిక్కుడు 32, దేముడుచిక్కుడు 64, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

జై హనుమాన్..

వైభవంగా అంజనీపుత్రుడి జయంతి వేడుకలు // స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు



వడ్లపూడి ఆలయంలో ఉసిరికాయలతో అలంకృతులైన పంచముఖ ఆంజనేయస్వామి

కూర్మన్నపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని గురువారు పలు ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. ఆలయాలన్నీ జై హనుమాన్.. నామస్మరణతో మార్మోగాయి. ఇందులో భాగంగా 87వ వార్డు వడ్లపూడిలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు కేశవశర్మ ప్రత్యేక పంచామృత అభిషేకాలు చేసి సహస్ర ఉసిరికాయలతో శోభాయమానంగా అలంకరించారు. సింధూర పూజలు, తమలపాకులు, గారెలతో అర్చనలు జరిపారు. పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, నాయకులు తాతనాయుడు, గోవింద్, ఎం.రాము, కృష్ణ, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కణితి కాళింగవీధి అభయాంజనేయస్వామి ఆలయంలో సింధూర, తమలపాకుల పూజలు చేశారు.

అదేవిధంగా 86వ వార్డు శాతవాహననగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామికి అర్చకులు శ్రీధర్‌స్వామి, కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో అర్చనలు, పూజలు జరిపారు. సింధూర, తమలపాకులతో పూజలు జరిపాక గారెలు, బూరెలతో అంజనీపుత్రున్ని అలంకరించారు. పలువురు మహిళలు సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసాను పఠించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిగీతాల నడుమ ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.శేషగిరిరావు, ఎం.శ్రీనివాసరావు, ధనుంజయరెడ్డి, సీహెచ్ సాయిరాం, జగపతిరాజు, పద్మారావు, తదితరులు పాల్గొన్నారు. 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, చట్టివానిపాలెంలోని హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని షీలానగర్‌లోని అంజనేయస్వామి ఆలయంలో వేదపండితులు స్వామివారికి కుంకుమ, సింధూరం, తమలపాకులతో పూజలు, అర్చనలు చేశారు. అలాగే నాతయ్యపాలెంలోని ఆలయంలో స్వామివారికి ఆలయ ధర్మకర్త గేదెల సింహాచలం, విజయలక్ష్మి దంపతులు వడమాల సేవ, తమలపాకులతో సహస్రనామార్చన జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

అగనంపూడి: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధనను ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరణం జగదీశ్, హనిత, సింహాచలం, మూర్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొండయ్యవలస, జాబిలి హిల్స్, గొన్నవానిపాలెంలో గల హనుమాన్ ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపారు.



శాతవాహన నగర్‌లో..



జాబిలి హిల్స్ ఆలయంలో ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

3వ రోజుకు ఉక్కు కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారం నాటికి మూడో రోజుకు చేరింది. విధులకు హాజరైన వారి సంఖ్య మాత్రం రెండు రోజులతో పోల్చుకుంటే కొద్దిగా తగ్గింది. సుమారు 40 శాతం మంది కాంట్రాక్టు కార్మికులు విధులకు దూరంగా ఉన్నారు. విధులకు హాజరైన కార్మికుల వద్దకు నాయకులు వెళ్లి సమ్మె ప్రాముఖ్యతను వివరించడంతో కొంతమంది కార్మికులు డ్యూటీ నుంచి బయటకు వచ్చేశారు. ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో పోలీస్ ఆంక్షలు ఉండడంతో కార్మికులు ఎక్కడా సమావేశం కాలేకపోతున్నారు. అదేవిధంగా ప్లాంటులో పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బందిని బందోబస్తుగా నియమించారు. కాంట్రాక్టు కార్మికుల విషయమై యాజమాన్యం స్పష్టమైన హామీ ఇస్తే తప్పా తాము సమ్మె విరమించేది లేదని కార్మిక నాయకులు పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యం తగదు

స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్య నిర్లక్ష్య వైఖరి తగదని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు అన్నారు. ప్లాంటులో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ముందుకు రావాల్సిన యాజమాన్యం వారిని విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపడుతుండడం భావ్యం కాదన్నారు. కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె ప్రభావం ప్లాంట్ ఉత్పత్తిపై పడుతుందని, అందువల్ల యాజమాన్యం స్పందించి కాంట్రాక్టు కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సదరం శిబిరానికి విశేష స్పందన

అగనంపూడి, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. గాజువాక నియోజకవర్గ పరిధిలో గల దివ్యాంగులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల రీ-వెరిఫికేషన్ ప్రకియను ఇక్కడ చేపట్టారు. ఇందుకోసం ఆర్థోపెడిక్ వైద్యులు రోహిత్, రవిచంద్ర, రవికిరణ్‌లను ప్రభుత్వం నియమించింది. నిత్యం 150 మంది వరకు రీ-వెరిఫికేషన్ కోసం ఇక్కడకు చేస్తున్నారు. వారంలో బుధ, గురు, శుక్రవారాల్లో దివ్యాంగులను పరీక్షించి వారికి ఎంతమేర అంగవైకల్యం ఉందో నిర్ధారించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. తగిన అర్హతలు చాలామంది దివ్యాంగ కోటాలో పింఛన్లు పొందుతున్నట్టు ప్రభుత్వం గుర్తించి ఈ కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తుంది. ఎంతో పారదర్శకంగా రీ-వెరిఫికేషన్ ప్రక్రియను చేపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. జూలై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు.



వైద్య పరీక్షల కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చిన దివ్యాంగ పెన్షన్‌దారులు



రైతుబజారు ప్రాంగణంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మరంగా పారిశుధ్య పనులు

గోపాలపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): మండంలోని పలు రహదారులు, గెడ్డలు, లోతట్టు ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులను పారిశుధ్య కార్మికులు గురువారం ముమ్మరంగా చేపట్టారు. బుధవారం కురిసిన వర్షానికి గెడ్డలు పొంగిపొర్లడంతో వ్యర్థాలు పేరుకుపోయాయని వారు పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సువర్ణ అవకాశం: ఎంఈవో

మల్కాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): ములగాడ మండల పరిధి క్రాంతినగర్‌లో గురువారం విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు కార్యక్రమం జిల్లా సహిత విద్య సమన్వయ కర్త బి.గీత, మండల విద్యశాఖ అధికారి డి. త్రినాథ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఓ దివ్యాంగ చిన్నారిని గుర్తించి, తన తల్లిదండ్రులకు భవిత కేంద్రాలు, చదువు, ఫిజియోథెరిపీ సేవలు, ప్రభుత్వ ఉపకారవేతనాలు, ఇతర రాయతీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిబిరం

సింధియా, మే 22, (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ షిప్‌యార్డ్ గాంధీగ్రామ్ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం సందడిగా సాగింది. ఉదయం 8 గంటల నుంచి విద్యార్థులు పుస్తక పఠనం, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయం వల్ల కలిగే ప్రయోజనాలను పిల్లలకు గ్రంథాలయాధికారి కనకరాజు వివరించారు. అనంతరం పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సభ్యులు, పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

పెందుర్తి, మే 22(ఆంధ్రజ్యోతి): చినముషిడివాడ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పీఠం ప్రాంగణలో 18 అడుగుల ఏకశిల దాసాంజనేయ స్వామి విగ్రహాన్ని అప్పాలు, వడమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పీఠంలో వజ్రణి స్కంద పాశుపత హనుమ మహాయజ్ఞాన్ని రుత్వికుల వేదమంత్రాలతో పీఠాధిపతులు స్వరూపా, స్వాత్మానందేంద్ర శాస్త్రోక్తంగా పూర్ణాహుతి చేశారు. ఈ యాగ ఫలం సైనికులకు మేలు చేకూరుతుందన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా వెంటాద్రి శిఖరం దగ్గరున్న అభయాంజనేయుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చినిముషిడివాడ ప్రాతంలో ఆంజనేయుని ఆలయాల్లో ప్రత్యేక కూడా పూజలు చేశారు. పురుషోత్తపురం వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నసమారాధన చేశారు.

మల్కాపురంలో

మల్కాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గాజువాక ఆర్టీసీ డిపో దగ్గరున్న ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వేపగుంటలో

వేపగుంట, మే 22(ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహానికి హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వడమాల, వివిధ పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు.

ఎన్ఏడీలో

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 22(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద ఉమామహేశ్వర ఆలయంలో ఉన్న అంజనేయస్వామికి హనుమాన్ జయంతి సందర్భంగా సింధూర పూజలు గురువారం నిర్వహించారు. పాత కరాసలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామిని మాజీ డిప్యూటి మేయర్ జియ్యాని దంపతులు దర్శించుకున్నారు.



హనుమాన్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

జీవ వైవిధ్యంపై అవగాహన

మల్కాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చే మార్పులు తట్టుకునే శక్తి జీవవైవిధ్యం ఇస్తుందని కళారత్న అవార్డు గ్రహిత సుంకర చలపతిరావు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతికి భంగం కలగకుండా చూసుకోవడంతో ఆహారభద్రత ఏర్పడుతుందని వ్యవసాయం, మత్స్యపరిశ్రమ, పశుపోషణ, అభివృద్ధి చెందుతాయని అన్నారు. అనంతరం జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి మాట్లాడుతూ ప్రకృతిలో ప్రతి జీవిని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

ఎన్.ఎ.డిజంక్షన్, మే 22(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కిట్‌లను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ గురువారం తన కార్యాలయం ఆవరణలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ 90వ వార్డు అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్



అరుణ్‌కుమార్‌ను సత్కరించిన ఎమ్మెల్యే గణబాబు, తదితరులు

ఎన్.ఎ.డి జంక్షన్, మే 22(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా శరగడం అరుణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రకటించారు. గురువారం 90వ వార్డుకు సంబంధించి కొత్త కమిటీల నియామకానికి పార్టీ ఆఫీస్‌లో కార్యకర్తలతో గణబాబు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యకర్తల అభిప్రాయాల మేరకు నూతన కమిటీలు ఏర్పాటు చేసి అధిష్టానానికి పంపించామని ఆయన అన్నారు. వార్డులో టీడీపీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలని ఆయన సూచించారు. వార్డు కార్యదర్శిగా కనకారావును, ఉపాధ్యక్షుడిగా పి.సతీశ్‌ను, యూత్ అధ్యక్షుడిగా ఎస్.గౌరిశ్‌ను, ఇతర కమిటీ సభ్యులను, ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎమ్మెల్యే గణబాబు, వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

గోపాలపట్నం, మే 22(ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ అధికారులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో భాగంగా స్టేషన్ ప్రాంగణంలో 'నో పార్కింగ్' జోన్‌లో నిలిపిన వాహనాలను తనిఖీ చేసి, పత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, ఈ విషయాన్ని గమనించాలని ఆర్‌పీఎఫ్ అధికారులు పలువురికి సూచించారు.



రైల్వే స్టేషన్ బయట పార్కింగ్ చేసిన వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది



సంఘీభావం తెలుపుతున్న పోరాట కమిటీ ప్రతినిధులు

నిరవధిక సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వాల కుట్ర

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు

కూర్మన్నపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తుండడం దారుణమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,561వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంటులో 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను అక్రమంగా తొలగించడం అన్యాయమన్నారు. ఇలా తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, భవిష్యత్తులో కార్మికుల తొలగింపు చర్యలను చేపట్టరాదన్నారు. మూడు రోజులుగా కాంట్రాక్టు కార్మికులు విధులకు వెళ్లకపోవడంతో కాంట్రాక్టర్లు, ఉక్కు అధికారులు తలలు పట్టుకుంటున్నారన్నారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడం భావ్యం కాదని వారు పేర్కొన్నారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకునేంత వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బి.గంగారావు, నాయకులు జె.అయోధ్యరామ్, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, నీరుకొండ రామచంద్రరావు, జె.రామకృష్ణ, పరంధామయ్య, జెర్రిపోతుల ముత్యాలు, జి.శ్రీనివాస్, మంత్రి రవి, దొమ్మేటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

గాజువాక, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పలు సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు ముందుకు రావాలన్నారు. 2016-2018 మధ్య కాలంలో కార్మికుల జీతాల నుంచి కట్ చేసిన ఇన్‌కం ట్యాక్స్ సొమ్ము ఇంకా చాలామందికి రిటర్న్ కాలేదన్నారు. తెల్ల రేషన్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, రాము, బంగారు నాయుడు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కూర్మన్నపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రత్యేక అవసరాలు గల పిల్లల తలిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సునీత కోరారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి భవిత కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వేను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గాజువాక మండలంలో సర్వే ద్వారా 15మంది చిన్నారులను గుర్తించామన్నారు. 3 నుంచి 18 ఏళ్ల వయసు గల ప్రత్యేక అవసరాల గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పవచ్చన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత, జిల్లా అడిషినల్ కో-ఆర్డినేటర్లు, భవిత ఉపాధ్యాయురాలు ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సీఐ అప్పారావు యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

సీఐగా అప్పారావు బాధ్యతల స్వీకరణ

మల్కాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐగా గొలగాని అప్పారావు యాదవ్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్సై శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది స్వాగతం పలికింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి స్పందించాలని, చట్ట ప్రకారం బాధ్యతలు నిర్వర్తించాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపులను ఆపాలి

సీఐటీయూ కార్మికుల డిమాండ్



శ్రీహరిపురంలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులను ఆపాలని డిమాండ్ చేస్తూ శ్రీహరిపురంలో 58, 59, 60 వార్డుల సీఐటీయూ కార్మికులు గురువారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 30 ఏళ్లగా స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న వారిని తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడువేల మందిని తొలగించారని, ఇంకా రెండవేల మందిని తొలగించే ఆలోచనలో ఉన్నారని అన్నారు. ప్లాంటును ఎట్టి పరిస్థితిల్లో ప్రైవేటీకరణ చేయవద్దని, రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకుని తొలగింపులను చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ సేవలు విస్తృతం

- లక్ష్య సాధన కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న ఉమ్మడి విశాఖ ఆర్టీసీ రీజియన్ విభాగం
- నెలకు రూ.1.82 కోట్లను ఆర్జించాలన్నది లక్ష్యం
- ప్రస్తుతం వస్తున్న ఆదాయం రూ.1.39 కోట్లు
- అథరైజ్డ్ ఏజెన్సీలు, పార్శిళ్ల బుకింగ్‌ను పెంచేందుకు చర్యలు
- ఫార్మా సంస్థల ఉత్పత్తులు, షాపింగ్ మాల్స్‌కు సంబంధించిన రవాణాపై దృష్టి సారించిన అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): **ఆదాయాన్ని సమకూర్చుకునే విషయంలో లక్ష్యాలను చేరువయ్యేందుకు ఉమ్మడి విశాఖ ఆర్టీసీ రీజియన్ లాజిస్టిక్స్ విభాగం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది. ఈ విభాగం నుంచి నెలకు రూ.1.82 కోట్లు ఆర్జించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు సగటున నెలకు రూ.1.39 కోట్లు మాత్రమే సంపాదిస్తుంది. ఇది లక్ష్యంలో 77 శాతంగా నమోదైంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి మొత్తం టార్గెట్‌ను చేరుకోవాలని లాజిస్టిక్స్ విభాగం అధికారులు నిర్ణయించారు.**

లాజిస్టిక్స్‌కు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో ద్వారకా బస్‌స్టేషన్, మద్దిపాలెం కాంప్లెక్స్, అనకాపల్లి కాంప్లెక్సుల్లో సొంత కార్యాలయాలు, బుకింగ్ కౌంటర్లు, పార్శిళ్లను భద్రపరిచే గొడౌన్లు ఉన్నాయి. అంతేకాక ఉమ్మడి విశాఖ జిల్లాలో 46 ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇవి ప్రధాన కూడళ్లలో, అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయి. ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లు, ఆథరైజ్డ్ ఏజెన్సీల నుంచి ప్రతిరోజూ సగటున 3,200 పార్శిళ్లను బుక్ చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన 5,800 పార్శిళ్లను డెలివరీ చేస్తున్నారు. పార్శిళ్ల బుకింగ్ ద్వారా నెలకు రూ.1.39 కోట్ల ఆదాయం వస్తున్నట్టు సంబంధిత అధికారులు లెక్కలు కట్టారు.

టార్గెట్ చేరేందుకు యత్నాలు..

ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి లాజిస్టిక్స్ ఆదాయం నెలకు రూ.1.82 కోట్లను ఆర్జించాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే ప్రస్తుతం నెలకు రూ.1.39 కోట్లు వస్తుంది. ఇది లక్ష్యంలో 77 శాతం మాత్రమే. మిగిలిన 23 శాతాన్ని కూడా సాధించాలని ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ముమ్మర ప్రయత్నాలు చేస్తుంది. ఈ క్రమంలో ఆథరైజ్డ్ ఏజెన్సీలను 46 నుంచి 60 వరకు, పార్శిళ్ల బుకింగ్‌ను 3,200 నుంచి 4,000కు పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆథరైజ్డ్ ఏజెన్సీల నిర్వాహణకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా, ఇప్పటికే 20 వరకు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు.

ఫార్మా సంస్థలు, మాల్స్‌పై ప్రత్యేక దృష్టి

ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఫార్మా సంస్థలు, మాల్స్, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాను పెంచుకునే దిశగా ఈ విభాగం యోచిస్తుంది. ఫార్మా సంస్థలకు సంబంధించిన ఉత్పత్తులను ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం ద్వారా అందుబాటులో ఉన్న అన్ని ప్రాంతాలకు రవాణా చేయాలని నిర్ణయించి.. ఆయా ఫార్మా సంస్థల యాజమాన్యాలతో సంప్రతింపులు జరుపుతున్నది. షాపింగ్ మాల్స్ నుంచి ఎక్కువ రవాణా జరుగుతుందని గుర్తించి తమకు అవకాశం కల్పించాలని సదరు మాల్స్ అధినేతలను కోరుతున్నది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ ఉత ్పత్తులను ఇతర జిల్లాలకు చేరవేసేందుకు గాను మార్కెటింగ్ కమిటీలను సంప్రదిస్తున్నది. ఈ ఏడాది చివర నాటికి ఎలాగైనా లక్ష్యాలను చేరుకుంటామని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


ద్వారకా బస్‌స్టేషన్‌లోని పార్శిళ్ల డెలివరీ గొడౌన్


పార్శిల్ బుకింగ్ కౌంటర్


బుక్ చేసిన పార్శిళ్లను భద్రపరిచే గొడౌన్

అర్చకుడు రమణాచార్యులు మృతి పట్ల సీఎం సంతాపం

సింహాచలం, మే 22 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం అర్చకుడు (2) ఇరగవరపు వెంకట రమణాచార్యులు (58) మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. అప్పన్న సేవలో తరించిన అర్చకుడు మృతి విచారకరమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు, తదితరులు కూడా సోషల్ మీడియా వేదికగా రమణాచార్యులు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

షరా మామూలే..

- పూర్ణామార్కెట్ రోడ్డుపై మళ్లీ వెలసిన దుకాణాలు
- పార్కింగ్ ప్రదేశంలో జంగిడీల ఏర్పాటు
- పట్టించుకోని పోలీసులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వన్‌టౌన్‌లోని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో షరా మామూలుగా మళ్లీ ఆక్రమణలు మొదలయ్యాయి. రోడ్డుపై వాహనాల పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశంలో జంగిడీలను పలువురు వ్యాపారులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పూర్ణామార్కెట్‌లో సుమారు 450 షాపులు, మరో 400 వరకు గ్యాంగ్‌వేజ్ దుకాణాలు ఉన్నాయి. మార్కెట్ లోపలే దుకాణాలన్నీ ఉండడంతో ఇక్కడకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు పక్కన కేటాయించిన పార్కింగ్ ప్రదేశంలో నిలిపి, తమకు కావాల్సిన సరకులను కొనుగోలు చేసుకుని వెళ్లేవారు. దీంతో ఈ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సజావుగా ఉండేది. కానీ ఆరు నెలల కిందట మార్కెట్‌లో ఆశీలు వసూలు వేలం పాడుకున్న కాంట్రాక్టరు రోడ్డుపై పార్కింగ్‌కు కేటాయించిన ప్రదేశంలో జంగిడీలు (దుకాణాలు) ఏర్పాటు చేసుకునేలా చిరువ్యాపారులను ప్రోత్సహించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు అధికమయ్యాయి. వాహనాల పార్కింగ్‌కు చోటు లేక ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ వాహనాలను నిలపడం ప్రజలు మొదలుపెట్టారు. దీనివల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని 'ఆంధ్రజ్యోతి'లో పలుమార్లు కథనాలు రావడంతో జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా రోడ్డుపై ఆక్రమణలను తొలగించడంతో సమస్య కొలిక్కి వచ్చింది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆశీలు వసూలు చేసే బాధ్యతను దక్కించుకున్న కొత్త కాంట్రాక్టరు ఆదాయం కోసం జీవీఎంసీ, పోలీస్ అధికారులను ప్రసన్నం చేసుకుని మళ్లీ మార్కెట్ రోడ్డులో విచ్చలవిడిగా దుకాణాలు ఏర్పాటు చేయించారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు మళ్లీ మొదటికొచ్చాయంటూ 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు రావడంతో సీపీ శంఖబ్రతబాగ్చి స్వయంగా ఈ ప్రాంతాన్ని పరిశీలించి రోడ్డుపై ఆక్రమణలను తొలగించారు. రోడ్డుపై వాహనాల పార్కింగ్ తప్ప దుకాణాలు ఉండడానికి వీల్లేదంటూ స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాటిని తొలగించారు. తరువాత పార్కింగ్‌కు ఇబ్బందులు తొలగాయి. కానీ ఇటీవల మార్కెట్ రోడ్డులో మళ్లీ ఆక్రమణలు పెరిగిపోయాయి. తొలుత ఒకరిద్దరు రోడ్డుపై జంగిడీలను పెట్టుకుని వ్యాపారం సాగించినా పోలీసులు పట్టించుకోలేదు. దీనిని ఆసరాగా చేసుకుని ఇప్పుడు పదుల సంఖ్యలో పార్కింగ్ స్థలాల్లో దుకాణాలు పెట్టేశారు. ఇప్పుడు మళ్లీ ట్రాఫిక్ సమస్య లు మొదలయ్యాయని పలువురు కొనుగోలుదారులు వాపోతున్నారు. దీనిపై సీపీ దృష్టిసారించి పటిష్ఠ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


పూర్ణామార్కెట్‌లో పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతంలో జంగిడీలపై వ్యాపారం

క్రైం... crime news

డ్రైనేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

జ్ఞానాపురం, మే 22 (ఆంధ్రజ్యోతి) : జ్ఞానాపురం ప్రధాన రహదారి పక్కనున్న సోఫియా కళాశాల సమీపంలోని డ్రైనేజీలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం డ్రైనేజీలో మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు గమనించి, కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని డ్రైనేజీ నుంచి బయటకు తీయించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల ఉంటాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ట్రాలీ ఢీకొని వ్యక్తి మృతి

కొమ్మాది, మే 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పీఎంపాలెం కార్‌షెడ్ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆనందపురం నుంచి నగరం వైపు వెళుతున్న ట్రాలీ ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలి యడం లేదు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్థల వివాదంలో కత్తితో వ్యక్తిపై దాడి

ఆనందపురం, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్వీపాలెం పంచాయతీలో ఇంటి స్థల వివాదంలో వ్యక్తికి గాయాలైనట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన ఇంటి లక్ష్మణరావు, ఇంటి ఆదిలక్ష్మికి 20 ఏళ్ల క్రితం వివా హం కాగా వారికి కార్తీక్ అనే కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో భర్త నుంచి విడిపోయిన ఆదిలక్ష్మి కుమారుడు కార్తీక్‌ను తీసుకుని అదే గ్రామానికి చెందిన బోర సూరిబాబును వివాహం చేసుకుంది. ఆదిలక్ష్మి పేరు మీద జగనన్న ఇల్లు మంజూరు కావడంతో నిర్మించుకున్నారు. అయితే మొదటి భర్త కుమారుడు కార్తీక్ ఆ ఇంటిని తన పేరు మీద మార్చమని తల్లి ఆదిలక్ష్మిని తరచూ ఇబ్బందులకు గురి చేస్తు న్నాడు. ఈమేరకు బుధవారం సాయంత్రం అయిదు గంటల సమయంలో తన తండ్రి లక్ష్మణరావు. ఆయన రెండవ భార్య కుమారుడు మణికంఠ, కార్తీక్ ముగ్గురూ కలిసి ఆదిలక్ష్మి వద్దకు వెళ్లి ఇంటి స్థలాన్ని కార్తీక్ పేరు మీద రాయమని ఒత్తిడి తేవడంతో కుటుంబ సభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో మణికంఠ కత్తితో బోర సూరిబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ముగ్గురు పరారయ్యారు. ఆదిలక్ష్మి బాధితుడ్ని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. సూరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

2న శాయ్ ట్రైనింగ్ సెంటర్‌లో వాలీబాల్ ప్రవేశ ఎంపికలు

విశాఖపట్నం, స్పోర్ట్స్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పోర్టు స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ట్రైనింగ్ సెంటర్‌లో వాలీబాల్ క్రీడలో శిక్షణ పొందేందుకు జూన్ 2న బాలుర, బాలికల ప్రవేశ ఎంపికలు నిర్వహించనున్నట్టు శాయ్ సెంటర్ ఇన్‌చార్జి ఎం.సత్యనారాయణ తెలిపారు. బాలుర విభాగానికి సంబంధించి 12 నుంచి 16 ఏళ్లలోపు వారు 190 సె.మీ లేదా ఆపైన ఎత్తు కలిగి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సర్టిఫికెట్ ఉండాలి. అలాగే 16 నుంచి 18 ఏళ్లలోపు వారు 190 సె.మీ. లేదా ఆపైన ఎత్తు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. బాలికల విభాగానికి సంబంధించి 12 నుంచి 16 ఏళ్లలోపు వారు 170 సె.మీ. లేదా ఆపైన ఎత్తు కలిగి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సర్టిఫికెట్ ఉండాలి. అలాగే 16 ఏళ్ల లేదా అంతకుమించిన బాలికలు 170 సె.మీ. లేదా ఆపైన ఎత్తు కలిగి జాతీయ బాక్సింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించి ఉండాలి. శిక్షణా శిబిరానికి ఎంపికైన వారికి ఆధునిక శిక్షణతో పాటు వసతి, ప్రతిరోజు రూ.300 విలువ చేసే డైట్, ఏడాదికి రూ.15 వేలు విలువ చేసే స్పోర్ట్స్ కిట్, చదువు నిమిత్తం ఏడాదికి రూ.మూడు వేలు, పోటీల్లో పాల్గొనేందుకు ఏడాదికి రూ.ఐదు వేలు, మెడికల్ ఖర్చులకు ఏడాదికి రూ.వెయ్యితో పాటు రూ.ఐదు లక్షల వరకు మెడికల్ ఇన్సూరెన్స్ కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, క్రీడా ధ్రువపత్రాలు, మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ : 94916 07748లో సంప్రదించాని కోరారు.

మెరైన్ ఫిట్టర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): వెసల్స్ నేవిగేటర్, మెరైన్ ఫిట్టర్ కోర్సులకు కేంద్రీయ మత్స్య నావిక, ఇంజనీరింగ్ శిక్షణ విభాగం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. రెండేళ్ల కాలపరిమితితో ఈ శిక్షణ ఉంటుంది. కొచ్చి, చెన్నై, విశాఖ కేంద్రాలుగా శిక్షణ ఇస్తారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, గణితం, సైన్స్ సబ్జెక్టులలో 40 శాతానికి పైగా మార్కులు వచ్చి ఉండాలి. ఈ ఏడాది పదో తరగతి పరీక్షకు హాజరైనవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు వయసు ఆగస్టు 2025 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు ఉంటుంది. దరఖాస్తులను సీఐఎఫ్ఎన్ఈటీ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను డైరెక్టర్, సిఫ్‌నెట్, ఫైన్ ఆర్ట్స్ ఎవెన్యూ, కొచ్చిన్- 682016 అనే చిరునామాకు జూన్ 16లోగా అందేలా పంపాలి.

కిరండూల్ రైలు కోరాపుట్ వరకే..

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో భద్రత నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో విశాఖ-కిరండూల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) రైలు ఈ నెల 26, జూన్ 2, 9న విశాఖ నుంచి కోరాపుట్ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండైల్-విశాఖ పాసింజర్ (58502) రైలు ఈ నెల 26, జూన్ 2, 9న కోరాపుట్ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. కోరాపుట్, కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలిపారు.

సరస్వతి పుష్కరాల ప్రత్యేక బస్సు ప్రారంభం


పుష్కరాల ప్రత్యేక బస్సును ప్రారంభించిన ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని కాళేశ్వరం సరస్వతి పుష్కరాల ప్రత్యేక బస్సును ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్వారకా బస్‌స్టేషన్ కారిడార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి కాళేశ్వరం పుష్కరాలకు రాకపోకలు సాగించే భక్తుల కోసం అవసరమైనన్ని ప్రత్యేక బస్సులను నడిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఇంద్ర, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి సర్వీసులను సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో సరస్వతి పుష్కరాలకు వెళ్లేవారి కోసం బస్సులను సిద్ధం చేశామన్నారు. ఆన్‌లైన్‌లో గానీ ఆథరైజ్డ్ ఏజెన్సీల నుంచి కానీ టికెట్లు రిజర్వ్ చేసుకునే అవకాశం ఉందని ఆర్ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, విశాఖ డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ చాంబర్‌ను ప్రారంభించిన దక్షిణ ఎమ్మెల్యే


తన సీటులో ఆశీనులైన డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు. చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జనసేన నేతలు కోన తాతారావు, శివశంకర్ తదితరులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు చాంబర్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్‌గా 64వ వార్డు కార్పొరేటర్ దోవిందరాజు రెండు రోజులు కిందట ఎన్నికైన సంగతి తెలిసిందే. గ్రేటర్ కార్యాలయంలోని మూడో అంతస్తులో తనకు కేటాయించిన చాంబర్‌ను జనసేన నేతల చేతులమీదుగా గోవిందరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.శివశంకర్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న పోలీసులు

కృష్ణా కళాశాల రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

మద్దిలపాలెం, మే 22 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెం కృష్ణా కళాశాల రోడ్డులో గురువారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. కృష్ణా కళాశాల వద్ద ఉన్న వైసీపీ కార్యాలయానికి వందలాది మంది కార్యకర్తలు ర్యాలీగా రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించిన మొల్లి అప్పారావుకు స్వాగతం పలికేందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున అశీల్‌మెట్ట నుంచి మద్దిలపాలెం వరకు ర్యాలీగా వ చ్చారు. దీంతో కృష్ణా కళాశాల రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సీతమ్మధార,హెచ్‌బీ కాలనీ, మద్దిలపాలెం నుంచి వచ్చే వాహనాలన్నీ నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటలు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్‌ను క్రమబద్ధీకరించారు.